దసరా ఉత్సవాలకు ముఖ్యమంత్రికి ఆహ్వానం

శ్రీశైల మహాక్షేత్రంలో ఈనెల 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరగనున్న దసరా మహోత్సవాలకు రావాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆహ్వానం పలికారు. ఈ మేరకు సోమవారం విజయవాడలోని ఉండవల్లి సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును ఆ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, శ్రీశైలం ఆలయ ఈవో డి.పెద్దిరాజులతో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. నంద్యాలలో మంత్రి ఎన్ఎండీ.ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణాలకు దేవస్థానం పర్యవేక్షకులు జి.రవి, ఈవో, సీసీ కార్తీక్ ఆహ్వాన పత్రికలను సోమవారం అందజేశారు.

– శ్రీశైల ఆలయం, న్యూస్‌టుడే



ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ముఖ్య కార్యదర్శి, ఈవో

పుచ్చకాయలమడకు నేడు ముఖ్యమంత్రి రాక

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంగళవారం పత్తికొండ మండలం పుచ్చకాయలమడకు రానున్నారు. మధ్యాహ్నం 12.40 గంటలకు హెలికాప్టర్‌లో వస్తారు. 1.05 గంటల నుంచి 1.10 వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. 1.45 గంటల నుంచి 2.25 వరకు కాశీశ్వరాలయంలో పూజలు అనంతరం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు నేరుగా లబ్ధిదారులకు అందజేస్తారు. 2.25 గంటల నుంచి 3.25 గ్రామస్థులతో ముఖాముఖికానున్నారు. రూ.1.38 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. సీఎం పర్యటన కేవలం ఒక్క గ్రామానికి సంబంధించినదే కావడంతో ఇతర ప్రాంతాల వారికి అనుమతి లేదని పోలీసులు తెలిపారు.


– న్యూస్‌టుడే, పత్తికొండ గ్రామీణం

అందని ఔషధం

ఆళ్లగడ్డకు చెందిన నారాయణ తన కుమార్తెకు నలతగా ఉండటంతో ఆసుపత్రికి తీసుకొచ్చారు. మెఫ్టాజెసిక్(పి) సిరప్‌ను బయట కొనుగోలు చేయాలని రాసిచ్చారు. ఇటీవలే డీసీహెచ్ఎస్ సీహెచ్‌సీని తనిఖీ చేసి బయట మందులు కొనుగోలు చేయమని చెప్పొద్దని, పరీక్షలు కూడా చేయాలని సూచించొద్దని చెప్పినా ఎటువంటి మార్పు రాలేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



- ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల కొరత
- బయట తెచ్చుకోవాలంటున్న వైద్యులు




ఆళ్లగడ్డ, డోన్, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఔషధాల కొరతతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. బయట తెచ్చుకోవాలని వైద్యులు చీటీలు రాసి ఇస్తుండటంతో పేదలపై ఆర్థిక భారం పడుతోంది.. సోమవారం ఆళ్లగడ్డ, డోన్ పట్టణాల్లో ఆరోగ్య కేంద్రాల వద్ద 'న్యూస్‌టుడే' బృందం పరిశీలన చేయగా విషయం వెలుగులోకి వచ్చింది. ఆళ్లగడ్డ సీహెచ్‌సీకి నిత్యం ఓపీ 250 నుంచి 300పైగా ఉంటుంది. చుట్టుపక్కల మండలాల నుంచే కాకుండా సమీప వైఎస్ఆర్ జిల్లా పెద్దముడియం మండలం నుంచి పెద్ద సంఖ్యలో రోగులు వస్తుంటారు. మందులు బయట కొనుగోలు చేసుకోవాలని.. రక్త పరీక్షలు బయట చేయించుకోవాలని రోగులకు సూచిస్తున్నారు. "రుద్రవరానికి చెందిన వలి తన కోడలిని ప్రసవానికి ఆసుపత్రికి తెచ్చారు. ప్రసవం తర్వాత మనవరాలు అనారోగ్యానికి గురికావడంతో కాలేయం పనితీరును తెలియజేసే 'బిలిరూబిన్' పరీక్షలను అక్కడి వైద్యుడు బయట ఉన్న ప్రైవేటు క్లినిక్ వెళ్లి చేయించుకోవాలని రాసిచ్చారు. ఈ పరీక్షలకు రూ.500 ఖర్చు చేశారు. ఆయనతో పాటు పలువురికి ఈ పరీక్షలు బయటే చేయించుకోవాలని చెప్పడం గమనార్హం.

పెద్దాసుపత్రిలోనూ వేదనే

డోన్ ప్రభుత్వ ఆసుపత్రిని 50 పడకల నుంచి 100 పడకలకు పెంచి పట్టణం నుంచి రుద్రాక్షగుట్ట వద్ద నిర్మించిన నూతన భవనంలోకి కొన్ని నెలల కిందట మార్చారు. పేరుకే పెద్దాసుపత్రి అయినా ఇక్కడ సమస్యలు రాజ్యమేలుతున్నాయి. వైద్యులతో పాటు సిబ్బంది కొరత వేధిస్తోంది. 23 మంది డాక్టర్లకు ప్రస్తుతం 16 మంది మాత్రమే ఉన్నారు. 96 మంది సిబ్బందికి 16 ఖాళీలు భర్తీ చేయాలి. ఇక్కడ ఓపీ 500 నుంచి 600 వరకు ఉండగా, ముగ్గురు ఫార్మసిస్టులకు ఒక్కరే ఉన్నారు. ఓ చిన్నారికి జ్వరం రావడంతో రెండు రకాల సిరప్‌లు ఇచ్చారు. మరో రకం లేదని, బయట కొనుగోలు చేసుకోవాలని వైద్యులు చీటీ రాశారు.

స్వాహా కార్యం!



కర్నూలు వ్యవసాయం, ఆత్మకూరు న్యూస్‌టుడే: ఆత్మకూరు సహకార బ్యాంకులో క్యాషియర్ రూ.80 లక్షలు స్వాహా చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ బ్యాంకులో క్యాషియర్‌గా అల్తాఫ్ ఏడాదిన్నరగా పనిచేస్తున్నారు. సొంత వ్యాపారం కోసం రుణం తీసుకోవడం ఎందుకనుకున్నారో ఏమో.. తాను పని చేసే బ్యాంకుకే కన్నం వేశారు. గత నాలుగైదు నెలలుగా బ్యాంకులోని డబ్బును సొంత వ్యాపారానికి ఉపయోగించుకుంటూ వస్తున్నారు నగదు నిల్వ ఉంచే లాకర్‌కు రెండు తాళాలు ఉంటాయి. అందులో ఒకటి క్యాషియర్ వద్ద.. మరొకటి అసిస్టెంట్ మేనేజరైన పాసింగ్ ఆఫీసర్ రంగయ్య వద్ద ఉంటుంది. బ్యాంకులో సొమ్ము ఎంత ఉందన్నది రంగయ్య పర్యవేక్షణ చేయాల్సి ఉంది. ఆయన ఉదాసీనంగా వ్యవహరించడంతో అల్తాఫ్ అక్రమాలకు అడ్డూఅదుపూ లేకుండా పోయింది. బ్యాంకులో క్యాషియర్, పాసింగ్ ఆఫీసర్‌పై పర్యవేక్షణ చేయాల్సిన బ్రాంచి మేనేజర్ పులిరాజు తమకేమీ తెలియనట్లు వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి.

ఇద్దరిపై సస్పెన్షన్ వేటు

సహకార బ్యాంకు సీఈవో ఆదేశాల మేరకు నంద్యాల ప్రాంతీయ కార్యాలయం చీఫ్ మేనేజర్ సౌజన్యకీర్తి సోమవారం విచారణ చేపట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకు విచారించారు. క్యాషియర్ అల్తాఫ్ బ్యాంకు డబ్బు స్వాహా చేసినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. పాసింగ్ ఆఫీసర్ రంగయ్య నిర్లక్ష్య వైఖరే కారణమని తేలింది. ఈ నేపథ్యంలో క్యాషియర్ అల్తాఫ్, పాసింగ్ ఆఫీసర్ (అసిస్టెంట్ మేనేజర్) రంగయ్యను సస్పెండ్ చేస్తూ బ్యాంకు సీఈవో విజయ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. బ్యాంకు శాఖ మేనేజర్ పులిరాజుకు తాఖీదులు జారీ చేసినట్లు సమాచారం. బ్యాంకు డబ్బు స్వాహా చేసిన అల్తాఫ్, పాసింగ్ ఆఫీసర్ రంగయ్యపై మంగళవారం ఆత్మకూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నారు. వారిద్దరిపై క్రిమినల్ కేసు నమోదు చేసే అవకాశాలున్నాయి.

రూ.కోట్లలో రుణాల పంపిణీ

ఆత్మకూరు సహకార బ్యాంకు పరిధిలో ఆత్మకూరు, వెంపెంట, నాగంపల్లి ప్రాథమిక సహకార సంఘాలున్నాయి. వీటి పరిధిలో 5-6 వేల మంది రైతులు సభ్యత్వం కలిగి ఉన్నారు. ఆత్మకూరు సహకార బ్యాంకులో ఏటా రూ.100-150 కోట్ల వ్యాపారం ఉంటుంది. ఏటా 500 మందికిపైగా రైతులకు పంట రుణాలు, మరో 500 మందికి ఇతర వ్యాపారాలకుగాను రూ.60-70 కోట్ల మేర రుణాలు మంజూరు చేస్తుంటారు. ఇంత పెద్దఎత్తున రుణాలు మంజూరు చేస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాల్సి ఉండగా.. సహకార బ్యాంకు శాఖ మేనేజర్ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

తలుపులు మూసేసి

ఆత్మకూరులోని సహకార బ్యాంకు తలుపులు మధ్యాహ్నం వరకు తెరుచుకోలేదు. అధికారులు, సిబ్బంది సమయానికి వచ్చినా తలుపులు మూసే ఉంచారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన పంట నష్ట పరిహారం జమైందో లేదో తెలుసుకోవడానికి వచ్చిన రైతులు ఇబ్బంది పడ్డారు. ఎందుకు మూసివేశారని ప్రశ్నిస్తే విద్యుత్తు లేదని సమాధానం ఇచ్చారు.. జనరేటర్ ఉంది కదా అని ప్రశ్నించగా నెట్‌వర్క్ సరిగా లేదు.. సర్వర్ పనిచేయడం లేదంటూ ఇలా వింత.. వింత సమాధానాలు చెప్పారు. బ్యాంకులో నిధులు పక్కదారి పట్టడంతో విచారణ నిమిత్తం ఉన్నతాధికారులు వచ్చారు. ఈ విషయం ఎక్కడ బయట పడుతుందేమోనని సిబ్బంది తలుపులు మూసివేసినట్లు తెలుస్తోంది.. ఈ విషయాన్ని మేనేజర్ దృష్టికి తీసుకెళ్లగా అలాంటిదేమి లేదని దాటవేయడం గమనార్హం.

బ్యాంకులో ఏదో జరుగుతోంది

– గోపాల్, జెడ్‌వారిపల్లె

బ్యాంకులో ఏదో జరుగుతోంది. మేనేజర్ గంటల తరబడి ఫోన్లోనే మాట్లాడుతున్నారు. సిబ్బంది కంప్యూటర్ల ముందు కూర్చుని దస్త్రాలు తిప్పుతున్నారు. మరికొందరు హడావుడిగా అటూ.. ఇటూ తిరుగుతున్నారు. ఖాతాలో పంట నష్టపరిహారం జమైందో లేదో చూడమంటే రేపు రమ్మంటున్నారు.

అధికారుల తీరు ఆశ్చర్యంగా ఉంది

– మల్లయ్య, ఎర్రమఠం

మాది కొత్తపల్లి మండలం ఎర్రమఠం. రూ.40 పెట్టి ఆటోలో ఆత్మకూరుకు ఉదయం వచ్చాను.. మధ్యాహ్నం వరకు బ్యాంకు తలుపులు మూశారు. ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోలేదు. నెట్‌వర్క్ లేదు మంగళవారం రోజు రమ్మన్నారు. ఒక రోజు పని మొత్తం ఆపేసుకొని వచ్చాం.. రోజంతా వృథా అయ్యింది. బ్యాంకుకు సెలవని చెప్పొచ్చు కదా.. అధికారులు తీరు ఏమాత్రం బాగాలేదు.

లడ్డూ కల్తీకి బాధ్యులను శిక్షించాలి



విశ్వ హిందూ పరిషత్ సభ్యుల ర్యాలీ

నంద్యాల పాతపట్టణం, గాంధీచౌక్, న్యూస్‌టుడే : తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వాడి హిందువుల మనోభావాలు దెబ్బతీసిన వారిని కఠినంగా శిక్షించాలని విశ్వహిందూ పరిషత్ సభ్యులు డిమాండు చేశారు. నంద్యాల పట్టణంలోని భరతమాత ఆలయం నుంచి గాంధీచౌక్ వరకు సోమవారం వారు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు చంద్రమౌళీశ్వరరెడ్డి మాట్లాడుతూ.. పవిత్రమైన తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై విచారణ జరిపి దోషులను వెంటనే అరెస్టు చేయాలని కోరారు. విష్ణువర్ధన్‌రెడ్డి, సందీప్, వాసు, బసవరాజు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన వినతులు సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు. సెంటినరీ హాల్‌లో ప్రజల నుంచి 307 వినతులు స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డీఆర్వో పద్మజ తదితరులున్నారు.



సమస్యలు వింటున్న కలెక్టర్ రాజకుమారి

జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా డా.జిలానీ

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డా.జిలానీని నియమిస్తూ ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న డా.ప్రసాద్‌రావు ఉద్యోగ విరమణ చేయడంతో ఆయన స్థానంలో సీనియర్ ప్రొఫెసర్ జిలానీని నియమించారు. మంగళవారం ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

ఖాతా దాటని ఆరోగ్యసిరి

- ఏడాదిగా పంపిణీ కాని రూ.60 లక్షలు

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యుల కొరత వేధిస్తోంది. ఎన్ని ప్రకటనలు ఇచ్చినా ప్రభుత్వం ఇచ్చే వేతనం సరిపోదని చాలామంది ముందుకు రావడం లేదు. దీంతో ఖాళీలు భర్తీ కావడం లేదు. ఫలితంగా ఆరోగ్యశ్రీ పథకం కింద చేసే శస్త్రచికిత్సలు ఆలస్యమవుతున్నాయి. ఎక్కువగా ప్రైవేటు ఆసుపత్రులకు వెళుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ శస్త్రచికిత్సలను పెంచే లక్ష్యంతో ప్రభుత్వం వైద్యులకు నగదు ప్రోత్సాహకాలు అందివ్వాలని నిర్ణయించింది. వేతనంతో పాటు ఆరోగ్యశ్రీ ప్రోత్సాహకం అందుతుందని కొందరు వైద్యులు ఉత్సాహంగా పనిచేశారు. వారికి ఆరోగ్యశ్రీ ద్వారా విడుదలైన డబ్బును మాత్రం నేటికీ వారి ఖాతాలో వేయకుండా అధికారులు తాత్సారం చేస్తున్నారు.

★ నంద్యాలలోని జిల్లా ఆసుపత్రి వైద్యవిధాన పరిషత్ వైద్యశాలను సర్వజన ఆసుపత్రిగా మార్పు చేశారు. దీంతో గతంలో ఇక్కడ పనిచేస్తున్న వైద్యులంతా ఇతర జిల్లాలు, ప్రాంతాల్లోని వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులకు వెళ్లారు. వారు బదిలీ అయిన తర్వాత నంద్యాలలో ఉన్నప్పుడు వారు చేసిన ఆరోగ్యశ్రీ శస్త్రచికిత్సలకు సంబంధించిన ప్రోత్సాహక నిధులు రూ.60 లక్షలు విడుదలయ్యాయి. ఈ మొత్తం సర్వజన ఆసుపత్రి ఖాతాలో జమ చేశారు. దీనిని వైద్యుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉన్నా ఏడాదిగా అధికారులు పట్టించుకోవడం లేదు.

★ మరోవైపు నంద్యాల వైద్యశాల సర్వజన ఆసుపత్రిగా మారినప్పటి నుంచి ఆరోగ్యశ్రీ సేవలు అందించిన వైద్యులకు కూడా రూ.60 లక్షలు విడుదలయ్యాయి. ఈ మొత్తాన్ని మాత్రం మూడు రోజుల్లో వైద్యుల ఖాతాల్లో జమ చేశారు. కాని వైద్య విధాన పరిషత్ సిబ్బందికి మాత్రం ఏడాదిగా డబ్బు చెల్లించకపోవడం విమర్శలకు దారితీస్తోంది.

సిబ్బంది కొరతతోనే జాప్యం

– డా.జఫ్రుల్లా, ఇన్‌ఛార్జి డీసీహెచ్ఎస్, నంద్యాల

జిల్లా ఆసుపత్రికి సంబంధించిన ఆరోగ్యశ్రీ నిధులు రూ.60 లక్షల వరకు ఏడాదిగా జీజీహెచ్ ఖాతాలో ఉన్నాయి. వాటిని వైద్యుల ఖాతాలకు జమ చేయాలని జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు తెలిపాం. సిబ్బందిని కేటాయించి త్వరలో వైద్యుల ఖాతాలకు నిధులు జమ చేసేందుకు కృషి చేస్తాం.

భారం శాకోపశాఖలు.

- సాగు తగ్గిన కూరగాయల విస్తీర్ణం
- 50 హెక్టార్లు దాటని ఆకు కూరల సాగు
- నేడు శాకాహార దినోత్సవం

10 లక్షల హెక్టార్ల సారవంతమైన నేలలు.. 7.40 లక్షల సమర్థులైన రైతులు ఉన్నారు.. దశాబ్దం కిందట 5 వేల హెక్టార్లకుపైగా సాగవగా ప్రస్తుతం 2 వేల హెక్టార్లకు మించడం లేదు. ఉమ్మడి జిల్లాలో టమాటా, ఉల్లి, పచ్చిమిర్చి వంటివి తప్ప మిగిలిన కూరగాయలు ఆశించినంత సాగవ్వడం లేదు. బీర, కాకర, బీన్స్, సొర, వంకాయ, క్యాబేజీ, క్యారెట్, క్యాలీఫ్లవర్, దోస, బెండ, బీర, కూరగాయలు, మునగ, చిక్కుడు వంటివీ ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. దీన్ని ఆసరా చేసుకొని వ్యాపారులు ధరలు అమాంతం పెంచుతున్నారు. ఐదేళ్ల కిందటి కూరగాయల ధరలు పోలిస్తే కిలోపై రూ.10 నుంచి రూ.70 వరకు పెరుగుదల కనిపిస్తోంది. ఒక్కో కుటుంబం రోజుకు కిలో చొప్పున అన్ని రకాల కాయగూరల వినియోగం జరుగుతుండగా.. సరాసరి కిలోకు రూ.60 వెచ్చించాల్సి వస్తోంది. వీటన్నింటికి కారణం కూరగాయల సాగుకు వైకాపా సర్కారు పట్టించుకోకపోవడమే.

పంట	కర్నూలు (హెక్టార్లలో)	నంద్యాల (హెక్టార్లలో)
ఉల్లి	16,918	3,433.73
టమాటా	2,658.73	2,610.44
పచ్చిమిర్చి	1,186.34	1,312.04
ఇతర కూరగాయలు	2,490.93	797.60
ఆకు కూరలు	24	18

★ ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసినవి


జనాభా: 42.22 లక్షలు

కుటుంబాలు: 13.31 లక్షలు

రోజుకు అవసరం: 250 గ్రాములు (ఒక వ్యక్తికి)

నిత్యం అవసరం: 1,000 టన్నులు

నిత్యం ఉత్పత్తి: 360 టన్నులు



–ఆత్మకూరు, న్యూస్‌టుడే:

రకం	తీసుకోవాల్సింది (గ్రాములు)
పప్పుదినుసులు	85
గింజలు, ఎండు పప్పులు	35
నూనె, కొవ్వు పదార్థాలు	27
కూరగాయలు	400
పండ్లు	100
తృణధాన్యాలు, సూక్ష్మధాన్యాలు	250
పాలు/పెరుగు	300మి.లీ.

★ జాతీయ పోషకాహార సంస్థ మార్గదర్శకాల ప్రకారం

అవసరం కొండంత.. సాగు పిసిరంత

- ఏడాది కాలంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 11 రకాల కూరగాయల పంటలు కలిపి 1,826.2 హెక్టార్లలో సాగవుతున్నాయి. 31,962.2 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అవుతోంది.
- ఉద్యాన శాఖ అధికారుల లెక్కల ప్రకారం ఒక కుటుంబం నిత్యం కిలో కూరగాయలు వినియోగిస్తుంది. ఉమ్మడి కర్నూలు జిల్లాకు నిత్యం వెయ్యి టన్నుల వరకు కూరగాయలు అవసరమవుతాయి.
- ఏడాది కాలంలో ఉమ్మడి జిల్లాలో అన్ని రకాల కూరగాయలు కలిపి 1,29,687 టన్నులు ఉత్పత్తి అవుతున్నాయి. నెలకు 10,807 మెట్రిక్ టన్నులు అవసరం.. జిల్లా అవసరాలకు తగ్గట్టుగా పంట లేదు. 640 టన్నుల కొరత ఉంది. వాటిని పక్క జిల్లా, పొరుగు రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

ఎండబెట్టిన వైకాపా

ఉద్యాన, కాయగూరలు సాగు చేసే రైతులకు వైకాపా ప్రభుత్వం రాయితీలు ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి జిల్లాలో ఉద్యాన సమగ్ర అభివృద్ధి మిషన్ కింద రూ.12.84 కోట్లు, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్‌కేవీవై) పథకం కింద రూ.2.04 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఏడాది గడిచిపోయినా.. ఆర్థిక సంవత్సరం ముగిసినా నిధులు విడుదల కాలేదు. ఒక్క రైతుకు రాయితీ అందలేదు. హైబ్రీడ్ విత్తనాలు కొనుక్కోలేక సాగు తగ్గించారు.

తెదేపా హయాంలో పచ్చగా

- తెదేపా ప్రభుత్వ హయాంలో కూరగాయల రైతులకు భారీగా రాయితీలు లభించేవి. హైబ్రీడ్ కూరగాయల విత్తనాలకు సంబంధించి ఒక్కో రైతుకు రూ.3 వేల విలువ చేసే విత్తన రాయితీలు, సాగు చేసేందుకు ముందుకు వచ్చే రైతులకు హెక్టారుకు రూ.20 వేలు ఇచ్చేవారు.
- శాశ్వత పందిళ్ల ఏర్పాటు చేసేందుకు ఎకరానికి రూ.2 లక్షల యూనిట్ వ్యయం కాగా.. అందులో 50 శాతం రాయితీ లభించేది.
- మల్చింగ్ పద్ధతిలో కూరగాయల సాగుకు హెక్టారుకు యూనిట్ వ్యయం రూ.32 వేలు కాగా.. అందులో 50 శాతం (రూ.16 వేలు) రాయితీ మంజూరు చేశారు.
- కోల్డ్ రూమ్‌ల ఏర్పాటుకు ఒక యూనిట్ వ్యయం రూ.12 లక్షలు కాగా అందులో రూ.9 లక్షలు రాయితీ లభించేది.
- కూరగాయల కలెక్షన్ సెంటర్ ఏర్పాటుకు రూ.15 లక్షల వ్యయం కాగా అందులో 75 శాతం (రూ.11.75 లక్షలు) రాయితీ కల్పించారు.

ఆళ్లగడ్డలో ఇసుక మాయం



- 610 మెట్రిక్ టన్నులు పక్కదారి

ఈనాడు, నంద్యాల: ఆళ్లగడ్డ మార్కెట్ యార్డులో నిల్వ ఉంచిన 610 మెట్రిక్ టన్నుల ఇసుక మాయమైంది.. పేదల ఇళ్ల నిర్మాణాల కోసం అధికారుల అక్కడ డంపింగ్ చేశారు. 11 వేల మెట్రిక్ టన్నులు ఉండాల్సి ఉండగా మొత్తంలో పక్కదారి పట్టడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిల్వచేసిన ప్రాంగణానికి గేట్లు ఉన్నాయి.. కాపలాదారుడు ఉన్నారు.. అయినా అక్కడి నుంచి ఇసుకను తరలించడం అంతుచిక్కని ప్రశ్నగా మారింది. ఈ అంశంపై గృహనిర్మాణశాఖ అధికారులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అధికారుల అలసత్వంపై కలెక్టర్ రాజకుమారి గణియా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుక మాయమైన ఉదంతంపై ప్రాథమిక విచారణ చేయాలని ఆర్డీవోను ఆదేశించారు. కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో హుటాహుటిన గృహనిర్మాణశాఖ తరపున డీఈ నాగరాజు, ఏఈ రమణారెడ్డిలు సోమవారం రాత్రి ఆళ్లగడ్డ పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేయాలా ? వద్దా? అన్న అంశంపై పోలీసులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఇసుక తరలించిన వారికి రాజకీయ అండదండలు ఉన్నట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఫిర్యాదుపై ప్రాథమిక విచారణ చేసిన అనంతరం కేసు నమోదు చేస్తామని పోలీసులు చెప్పినట్లు సమాచారం.

కుందూలో మట్టి దొంగలు



కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: కుందూ నదీ విస్తరణలో భాగంగా పూడిక తీయగా వచ్చిన మట్టిపై అక్రమార్కుల కన్నుపడింది. నదికి ఇరువైపులా గుట్టల్లా పోసిన మట్టిని యథేచ్ఛగా తరలించుకుపోతున్నారు. కుందూలో పూడిక పేరుకుపోవడంతో ఏటా వరదలు ముంచెత్తి పంటలు నీట మునుగుతున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని గత ప్రభుత్వం నదీ విస్తరణకు శ్రీకారం చుట్టింది. గుత్తేదారుడికి బిల్లులు ఇవ్వకపోవడంతో గుత్తేదారుడు మధ్యలోనే పనులు ఆపేశారు. నదిని విస్తరించేందుకు తవ్విన మట్టిని నదికి ఇరువైపులా పెద్ద ఎత్తున కట్టలుగా పోశారు. జొలదరాశికి చెందిన ఓ వ్యక్తి గత కొన్ని రోజులుగా మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నాడు. తరలించే దూరాన్ని బట్టి ట్రాక్టరు ట్రిప్పునకు రూ.350 నుంచి రూ.1000 వరకు తీసుకొంటున్నారు. నిత్యం 50 నుంచి 70 ట్రిప్పులు తరలిస్తూ రూ.వేలల్లో ఒక్కరోజులోనే సంపాదించేస్తున్నారు. పొలాన్ని చదును చేసేందుకు 100 ట్రిప్పుల మట్టి కావాలని ఒకరు అడిగితే, ఇంకొకరు గోదాము ముందర చదునుకు సుమారు 50 ట్రిప్పులు కావాలని ఆయన్ని సంప్రదించినట్లు తెలుస్తోంది. కుందూనది ఒడ్డున బహిరంగంగానే మట్టిని తరలిస్తున్నప్పటికీ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సీతాఫలం.. సిరులు ఘనం



పండ్లు చూపుతున్న రైతు శ్రీనివాసులు

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రస్తుతం మార్కెట్లో సీతాఫలాలు విరివిగా లభిస్తున్నాయి. బనగానపల్లి మండలంలోని పెద్దరాజుపాలెం గ్రామానికి చెందిన రైతు శ్రీనివాసులుగౌడ్ సీతాఫలం సాగు చేసి మంచి దిగుబడి సాధించారు. రాజమహేంద్రవరం నుంచి బాలానగర్ రకానికి చెందిన సీతాఫలం మొక్కలను 2021లో నాలుగు ఎకరాల్లో సాగు చేశారు. ఎకరానికి 240 మొక్కలను 4.1 మీటర్ల వెడల్పుతో నాటారు. మొదట్లో ఎకరానికి రూ.70 వేలు ఖర్చు చేశారు. రెండేళ్ల తర్వాత ఎకరానికి రూ.30 వేలు చెట్ల కత్తిరింపు, కూలీలు, మందులకు ఖర్చు పెట్టారు. ఇటీవల కోతకు వచ్చాయి, రోజుకు 60 కిలోల పండ్లు అమ్ముతున్నారు. ప్రస్తుతం మార్కెట్లో కిలో రూ.70కు విక్రయిస్తున్నారు. ఎకరానికి 6 టన్నుల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతు శ్రీనివాసులుగౌడ్ పేర్కొన్నారు. సీతాఫలం తోటను ఉపాధి హామీ నిధులతో సాగు చేసినట్లు తెలిపారు. మొదటి ఏడాది 8 నెలలు, రెండు, మూడేళ్లలో 10 నెలలపాటు మొక్కకు రూ.14 చొప్పున ప్రతి నెలా ఇస్తారని ఆయన వివరించారు.

రైతేరాజు

బెండ.. రైతుకు అండ



బెండ తోటలో రైతు ఉసేనాళం

పగిడ్యాల, న్యూస్‌టుడే: మండలంలోని లక్ష్మాపురం గ్రామానికి చెందిన ఉసేనాళం బెండ సాగు చేశారు. దుక్కిని మెత్తగా దున్నుకోవాలి. దుక్కిలో డీఏపీ, వేప పిండి వేసుకోవాలి. నందికొట్కూరు నుంచి మహేంద్రరాజ రకం బెండ విత్తనాలు కొనుగోలు చేసి తెచ్చారు. 100 సెంట్లకు కిలో చొప్పున అడుగు దూరంలో నాటారు. మొత్తం 2 వేల మొలకలు ఉండాలి. వాటి మధ్యలో గడ్డి రాకుండా చూసుకోవాలి. 45 రోజుల తర్వాత కాయలు కోతకు వస్తాయి. ఒక్కో మొక్కకు రోజు తర్వాత రోజు 500 గ్రాముల వరకు దిగుబడి వస్తుంది. 90 రోజులపాటు కోత కోసే అవకాశముంది. ఎకరం బెండ సాగుకు రూ.20 వేలు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. ఖర్చులన్నీపోనూ రూ.50 వేల వరకు ఆదాయం వస్తుందని ఉసేనాళం తెలిపారు.

జాగ్రత్తలే నివారణ చర్యలు



డాక్టర్ రాఘవేంద్రచౌదరి, సమన్వయకర్త కృషి విజ్ఞాన కేంద్రం బనవాసి

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే : పంటలలో తెగుళ్లను నివారణకు ఏ విధమైన జాగ్రత్తలు, ఎలాంటి మందులు వినియోగించుకోవాలనే అంశాలపై రైతులు డా.రాఘవేంద్రచౌదరిని ప్రశ్నలు అడిగారు. సమధానాలు ఆయన మాటల్లోనే

సమస్య : మిరపలో వేరుపురుగు వలన మొక్కలు చనిపోతున్నాయి. – శ్రీనివాసులు, అల్వాల

రాఘవేంద్రచౌదరి: వేర్ల రక్షకం క్లోరిపైరిఫాస్ 10జీ గుళికలు ఎకరానికి ఐదు కిలోలు లేదా థయోమిథాక్సమ్‌+ఫిప్రోనిల్ గుళికలు ఎకరానికి ఐదు కిలోలు వేసుకోవాలి.

సమస్య: వర్షాలకు పత్తి కాయ కుళ్లు అవుతోంది. – విరుపాక్షి, కోటేకల్

రాఘవేంద్రచౌదరి: కాయ కుళ్లిపోకుండా కాపర్‌ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు, ప్లాంటోమైసిన్ 0.2మి.లీ. లీటరు నీటిలో కలిపి కాయ తడిచే విధంగా పిచికారీ చేసుకోవాలి.

ఖర్చు పొదుపు.. సమయం అదుపు



పత్తిలో మందు పిచికారీ చేస్తున్న యంత్రం

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోని మండలం ఢణాపురం గ్రామానికి చెందిన రైతు నాగన్న ఏడాది కిందట పిచికారీ యంత్రంతో కూడిన ట్రాక్టర్‌ను తీసుకువచ్చారు. ట్రాక్టర్‌ ప్రత్యేకంగా డ్రమ్ము, పిచికారీ యంత్రాలు, చిన్న చక్రాలు అమర్చారు. ట్రాక్టర్‌ రూ.10 లక్షలు, పరికరాలకు రూ.1.75 లక్షలు, ఇతర ఖర్చులు కలిపి రూ.12 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. ఇందులో ప్రభుత్వం 40 శాతం రాయితీ ఇవ్వగా, బ్యాంకు రుణ సాయం పొందారు. సొంత పొలంతోపాటు కౌలుకు తీసుకున్న పొలం 30 ఎకరాల వరకు ఉంది. ట్రాక్టర్‌ యంత్రంతో తన పొలంతోపాటు ఇతర రైతుల పొలాల్లోనూ మందు పిచికారీ చేస్తున్నారు. గంటకు 10 ఎకరాలు, ఒక రోజుకు 50 నుంచి 60 ఎకరాలకు పిచికారీ చేస్తున్నట్లు నాగన్న పేర్కొన్నారు. ఎకరానికి పిచికారీ చేస్తే రూ.200 బాడుగ తీసుకుంటున్నట్లు తెలిపారు. ఒక ఎకరంలో మనుషులు మందు కొట్టాలంటే ముగ్గురు కావాలి. ఒకరికి కనిష్ఠంగా రూ.300 లెక్కన రూ.900 అవుతుంది. ఈ యంత్రంతో సమయం ఆదాతోపాటు ఖర్చు తగ్గుతుందని వివరించారు.

వంకాయ తోట.. లాభాల పంట



మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధం చేస్తున్న రైతు రాము

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కోడుమూరు మండలం ప్యాలకుర్తికి చెందిన తెలుగు రాము వంకాయ సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. పంట యజమాన్య పద్ధతిలో తనకున్న 1.50 ఎకరం పొలంలో వంకాయ సాగు చేస్తున్నారు. సేంద్రియ పద్ధతిలో భూసారం పెంచేందుకు మూడు రోజులపాటు గొర్రెల (జీవాలు) మందను పొలంలో ఉంచారు. వాటి నుంచి వచ్చే విసర్జకాలు, మూత్రంతో భూమిని సారవంతం చేశారు. జీవాల ఎరువుతో పంటకు మంచి పోషకాలు అందడంతో దిగుబడి పెరుగుతుందన్నారు. గొర్రెల మందకు రోజుకు రూ.2 వేల చొప్పున ఖర్చు చేశారు. గూడూరు మండలం చనుగొండ్ల నర్సరీలో పెంచిన వంకాయ నారును కొనుగోలు చేశారు. పెట్టెలో సుమారు 100 మొక్కలుంటాయి. పెట్టె ధర రూ.60 ఉంటుంది. 1.50 ఎకరంలో 180 పెట్టెల నారను కొనుగోలు చేసి నాటారు. మొదట్లో మాత్రమే భూమందులు వాడారు. రెండు నెలలకు పంట దిగుబడి మొదలైంది. పంట చేతికొచ్చే వరకు రూ.60 వేలు పెట్టుబడి పెట్టారు. కోతకు 100 గంపలు దిగుబడి తీస్తున్నారు. కర్నూలు మార్కెట్‌కు తరలించి అమ్ముకుంటున్నారు. దిగుబడులు మొదలయ్యాక పురుగు నివారణకు, కూలీల ఖర్చు ఉంటుంది. మూడు రోజులకొకసారి కోతలుంటాయి. ఆ సమయంలో మినహా బిందు పద్ధతిలో నీటిని అందించారు. ప్రస్తుతం పంట కోతలు సాగుతున్నాయి. ఇప్పటి వరకు రూ.2 లక్షలకుపైగా ఆదాయం వచ్చిందన్నారు.

రక్తం పంచుతూ.. ప్రాణాలు నిలుపుతూ

నేడు స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : ఆపద సమయంలో అవసరమైన రక్తం అందక ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారు.. ఈ పరిస్థితుల్లో అన్ని దానాల్లోకి రక్తదానమే మిన్న అని నమ్మిన పలువురు.. అభాగ్యులకు ఆపద్బాంధవులుగా మారాయి. ప్రమాదాల్లో గాయపడిన వారికి.. ప్రసవం సమయంలో గర్భిణులకు.. రక్తహీనతతో బాధపడే వారికి.. అత్యవసర పరిస్థితుల్లో రుధిర దానం చేసి ప్రాణాలు నిలుపుతున్నారు. అనవసర భయాలు, అపోహలతో కుటుంబ సభ్యులే రక్తమిచ్చేందుకు వెనకాడుతున్న పరిస్థితుల్లో.. ఏ బంధుత్వం లేకున్నా.. మానవత్వమే మిన్న అని నమ్మిన ఎంతోమంది స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకొస్తున్నారు. సాటివారి ప్రాణాలు కాపాడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

సామాజిక మాధ్యమాల వేదికగా..

నంద్యాల, కర్నూలు పట్టణాల్లో సామాజిక మాధ్యమాల వేదికగా పలువురు రక్తదాతలు చేతులు కలుపుతున్నారు. ఉమ్మడి జిల్లాలో పలు వాట్సప్ గ్రూపుల ద్వారా సేవలు అందిస్తున్నారు. రోగి వివరాలతో పాటు కావాల్సిన రక్తం గ్రూపును వాట్సప్‌లో పోస్టు చేస్తే.. దాతలు స్వచ్ఛందంగా ఆసుపత్రులు, రక్తనిధి కేంద్రాలకు వెళ్లి రక్తదానం చేస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్నారు.

కొరవడిన ప్రోత్సాహం

గతంలో ఆరు నెలలు, ఏడాదికి ఒకసారి రక్తదాతలకు అభినందన సభలు ఏర్పాటు చేసేవారు. సన్మానాలు, ప్రశంసాపత్రాలు అందజేసి వారిని ప్రోత్సహించే వారు. రక్తదానం చేయాలని అవగాహన సదస్సులు నిర్వహించే వారు. నంద్యాల జీజీహెచ్ రక్తనిధి కేంద్రానికి శిబిరాల, సదస్సుల నిర్వహణకు గతేడాదిలో రూ.2.43 లక్షలు మంజూరు చేశారు. శిబిరాలు ఏర్పాటు చేసి రక్తం సేకరించారు. రక్తదాతలను ప్రోత్సహించే విధంగా సన్మానాలు, అభినందన కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉన్నా వైద్యాధికారులు పట్టించుకోలేదని రక్తదాతలు విమర్శిస్తున్నారు. రక్తదాతల దినోత్సవం సందర్భంగా కూడా కనీస ప్రోత్సాహం లేదని వాపోతున్నారు.

● నంద్యాలలోని విజయ రక్తనిధి కేంద్రం ద్వారా ప్రతినెలా 50 మంది తలసేమియా బాధితులకు ఉచితంగా రక్తం అందజేస్తున్నారు. దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రుధిరం ఇస్తుండటం వల్లే ఇది సాధ్యమవుతోందని నిర్వాహకులు చెబుతున్నారు.

సం॥రాలు	స్వచ్ఛందంగా రక్తమిచ్చిన వారు	నిర్వహించిన శిబిరాలు	శిబిరాల ద్వారా సేకరించిన యూనిట్లు	ఏడాది మొత్తం సేకరించిన రక్తం యూనిట్లలో
2021-22	37,926	99	4615	48,135
2022-23	39,086	216	7939	51,076
2023-24	39,758	228	6537	50,123
2024	19,632	66	1838	23,380

(ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు)

30 సార్లు ఇచ్చా - కిషోర్ నందమూరినగర్, నంద్యాల



నాది 'ఎ పాజిటివ్' గ్రూపు రక్తం. నేను ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నా. ఎవరికైనా అత్యవసర సమయాల్లో ఎ పాజిటివ్ రక్తం అవసరమని సమాచారం ఇస్తే స్వయంగా ఆసుపత్రికి వెళ్లి రక్తదానం చేస్తున్నా. గత 12 ఏళ్లలో 30 సార్లు రక్తదానం చేశా.

అరుదైన రకం - పరుశురామ్ హరిజనపేట, నంద్యాల



నేను కూలి పనులు చూసుకుంటూ జీవిస్తున్నా. సమాజ సేవ చేయాలన్నది నా ఆశయం. ఇందుకోసం రక్తదానాన్ని ఎంచుకున్నా. నాది 'బి నెగెటివ్' గ్రూపు రక్తం. ఇది అరుదైన గ్రూపు. గత పదేళ్లుగా నేను రక్తదానం చేస్తున్నా. ఇప్పటి వరకు 28 సార్లు రక్తం ఇచ్చా.

33 సార్లు రక్తదానం చేసిన - తేజ, నూనెపల్లె, నంద్యాల



నాది 'ఎబి పాజిటివ్' రక్తం రక్త గ్రూపు. నేను ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నా. ఎవరైనా అత్యవసర సమయంలో రక్తం కావాలని సమాచారం ఇస్తే వెంటనే వారున్న చోటికి వెళ్లి ఇస్తున్నా. గత 12 ఏళ్లుగా రక్తదానం చేస్తున్నా. ఇప్పటి వరకు 33 సార్లు రుధిరం ఇచ్చా. ప్రాణాపాయంలో ఉన్నవారికి రక్తదానం చేయడం ఎంతో సంతృప్తినిస్తుంది.

వరద బాధితుల సహాయార్థం విరాళం



మండల తెదేపా అధ్యక్షుడు కాతా రమేశ్‌రెడ్డికి చెక్కును అందజేస్తున్న వెలుగు కార్యాలయ అధికారులు, సిబ్బంది

మిడుతూరు, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం మండల మహిళా సమాఖ్య తరఫున గ్రామాల్లో రూ.1,67,860 విరాళాలు సేకరించారు. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును ఏపీఎం సుబ్బయ్య, సీసీలు, ఓబీలు, మహిళా బ్యాంకు సీఈవో శ్రీలక్ష్మి తదితరులు మండల తెదేపా అధ్యక్షుడు కాతా రమేశ్‌రెడ్డికి సోమవారం అందజేశారు.

ప్రభుత్వ మద్యం దుకాణాలకు తాళం

- ముగిసిన సేల్స్‌మెన్లు, సూపర్‌వైజర్ల ఒప్పందం

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లాలో పలు ప్రభుత్వ మద్యం దుకాణాలు మూతపడనున్నాయి. ఈ దుకాణాల్లో పనిచేసే సేల్స్‌మెన్లు, సూపర్‌వైజర్ల ఒప్పందం సోమవారంతో ముగిసింది. నూతన మద్యం పాలసీ అమలుకు కొద్ది రోజులు పట్టే అవకాశం ఉండటంతో ప్రభుత్వ మద్యం దుకాణాలు మరో వారం రోజులు కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందులో పనిచేసే సేల్స్‌మెన్లు, సూపర్‌వైజర్లలో అధిక శాతం మంది తాము విధులకు రాలేమని తేల్చి చెప్పినట్లు తెలిసింది. ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని కోరుతూ గత కొంతకాలంగా వీరు డిమాండ్ చేస్తున్నారు.. మరోవైపు విధులకు హాజరుకావాలంటూ అధికారులు పలువిధాలా వారికి నచ్చజెప్పినా ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో పలు ప్రభుత్వ మద్యం దుకాణాలు మూతపడనున్నట్లు అధికారులు అంచనాకు వచ్చారు. విషయాన్ని ఆ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి తీసుకెళ్లారు. వీలైనన్నిచోట్ల ప్రభుత్వ మద్యం దుకాణాలు నిర్వహించాలని మంత్రి సూచించారు. అక్రమ మద్యం ప్రభావం పడకుండా.. బార్లలో మద్యం లోటు లేకుండా నిల్వ చేసి అమ్మకాలు జరపాలని ఆదేశించినట్లు తెలిసింది. ఈ మేరకు ఆబ్కారీ శాఖ అధికారులు బార్లలో మద్యం సరకు తరలించే ఏర్పాటు చేస్తున్నారు. పలు ప్రాంతాల్లో బార్లు లేకపోవటం, ఉన్నచోట బార్లలో అధిక ధరలకు మద్యం విక్రయించనున్న నేపథ్యంలో అక్రమ మద్యం ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయని అధికారులు భావిస్తున్నారు.

నంద్యాల విద్యుత్తు సర్కిల్‌కు అధికారుల కేటాయింపు

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: ఏపీఎస్పీడీసీఎల్ డిస్కం పరిధిలో నంద్యాల జిల్లాకు కొత్తగా ఆపరేషన్ సర్కిల్‌ను ఏర్పాటుచేస్తూ సీఎండీ సంతోషరావు ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా పలువురు ఉన్నతాధికారులు, సిబ్బందిని నంద్యాలకు కేటాయిస్తూ సీఎండీ సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. విద్యుత్తు శాఖ నంద్యాల ఆపరేషన్ సర్కిల్‌కు జీఎం/ఎస్ఈ-1, ఈఈలు-4; డీఈఈలు-20, అకౌంట్స్ అధికారి-1, అసిస్టెంట్ అకౌంట్స్ అధికారి-1, పర్సనల్ అధికారి-1ని కేటాయించారు. ఏఈ/ఏఈఈ, జేఈ, జేఏవో, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ తదితర ఉద్యోగులకు సంబంధించి నియామకం కమిటీ ద్వారా నిర్ణయించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నంద్యాల డివిజన్ కార్యాలయాన్నే ఆపరేషన్ సర్కిల్ కార్యాలయంగా వినియోగించుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తికి ఆహ్వానం

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలో ఈ నెల 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరుగనున్న దసరా మహోత్సవాలకు రావాల్సిందిగా కోరుతూ కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధికి దేవస్థానం పర్యవేక్షకులు జి.రవి, అర్చకులు సోమవారం ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు స్వామిఅమ్మవార్ల శేషవస్త్రాలు, ప్రసాదం అందజేసి వేదాశీర్వచనాలు పలికారు.

వైభవంగా మహానందిలో నందీశ్వరాభిషేకం



మహానందిలో నందీశ్వరునికి పూజలు చేస్తున్న పండితులు, అర్చకులు

మహానంది, న్యూస్‌టుడే: మహానంది క్షేత్రంలో వెలసిన నందీశ్వరునికి ప్రదోషకాల పూజలను చేశారు. సోమవారం భాద్రపద బహుళ త్రయోదశిని పురస్కరించుకొని ఆలయ వేదపండితులు రవిశంకరఅవధాని, హనుమంతరాయశర్మ, ఆంజనేయశర్మ, ప్రధానార్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, ఉపప్రధానార్చకులు జనార్దన్‌శర్మలు నందీశ్వరునికి గణపతిపూజ, కంకణధారణ, పీఠార్చన, క్షీరాభిషేకం వంటి పూజలు చేసి మహా మంగళహారతి సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులు శివపంచాక్షరీ మంత్రోచ్ఛారణలతో హోరెత్తించారు. మహానందీశ్వర సహిత కామేశ్వరీదేవి అమ్మవార్లకు అర్చనలు, పూజలు చేశారు. అనంతరం పల్లకిలో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు.

నందీశ్వరునికి త్రయోదశి పూజలు



పూజలు చేస్తున్న ఆలయ అర్చకులు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: లోకకల్యాణార్థం శ్రీశైల మహాక్షేత్రం ఆలయ ప్రాంగణంలోని శనగల బసవన్న నందీశ్వరునికి సోమవారం త్రయోదశి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు నందీశ్వరునికి పంచామృతాభిషేకం, అభిషేకాలు నిర్వహించి మంగళహారతులు సమర్పించారు.

మన ఆప్తులు..మలిసంధ్య కిరణాలు



☛ వృద్ధులను కాపాడుకోవడం అందరి బాధ్యత ☛ నేడు 'ప్రపంచ వృద్ధ దినోత్సవం'



ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: పెద్దల మాట చద్దన్నం మూట అన్నారు.. అలాంటి పెద్దల జనాభా ఏటా పెరుగుతోంది. రాష్ట్ర జనాభాలో 60 ఏళ్లు నిండిన వృద్ధులు 12.4 శాతం ఉంటే.. ఈ సంఖ్య 2031 నాటికి 16.4శాతం పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. వారం రోజుల కిందట ఎస్‌బీఐ సంస్థ దేశ జనాభా పెరుగుదలపై నిర్వహించిన సర్వేలో వృద్ధుల శాతం పెరుగుతోందని తేల్చింది. మన రాష్ట్రంలో కూడా 12.4 ఉన్నట్లుగా పేర్కొన్నారు. 2024లో ఉమ్మడి కర్నూలు జనాభా 46,69,000 కాగా జిల్లాలో 5.5 లక్షల మంది వృద్ధులు ఉన్నారు. దేశ వ్యాప్తంగా వృద్ధుల్లో 11.8% మంది నిర్లక్ష్యానికి గురవుతున్నారనే నివేదికలు ఆందోళన కలిగిస్తున్నాయి. పెద్దలంటేనే ఆలోచనా పరులు, అనుభవజ్ఞులు. వారి అవసరం సమాజానికి ఎంతో అవసరం. వారికి ఆర్థికంగా, సామాజికంగా రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో చర్యలు తీసుకుంటున్నాయి.

ఆరోగ్య సమస్యలు అధికమే

వృద్ధుల్లో ఆరోగ్య సమస్యలు అధికమే. జిల్లాలో నిర్వహించిన ఓ సర్వే ప్రకారం 38% మంది వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారని తేలింది. ఆర్థికంగా కూడా కేవలం 11% మంది మాత్రమే తమ సంపాదన, ఆదాయ వనరుల మీద ఆధారపడినట్లు తేటతెల్లమైంది. 19% మంది పాక్షికంగా, 55% మంది పూర్తిగా ఇతరులపైన ఆధారపడినట్లు సర్వేలో తేల్చారు. వృద్ధుల్లో 10% మంది ఒంటరి జీవితం గడుపుతున్నారు.

పన్నులూ తక్కువే

ఆర్థిక ఇబ్బందుల భారం వారికి పెనుభారంగా మారకుండా ప్రభుత్వం పన్నుల విధింపులోనూ వెసులుబాటును ఇస్తోంది. రూ.3 లక్షల వరకు ఆదాయం ఉన్న వృద్ధులపై ఎలాంటి పన్నులు ఉండవు. 80 ఏళ్లు దాటిన సూపర్ సీనియర్లకు రూ.5 లక్షల ఆదాయం వరకు ఎలాంటి పన్నులు ఉండవు.

■ ఆరోగ్య బీమాలో రూ.30 వేల ప్రీమియం వరకు పన్నుల మినహాయింపు ఉంటుంది. ఆదాయపు పన్ను చట్టం 1961, సెక్షన్ 8డీ కింద ఈ మినహాయింపులు వర్తిస్తాయి

■ పొదుపు ఖాతాల్లో దాచిన డబ్బులపై 60 ఏళ్లు దాటిన వారికి 8.4% వడ్డీ లభిస్తుంది.

చట్టాలు సైతం వీరికి తోడుగా...

చట్టాలు సైతం వృద్ధులకు తోడుగా నిలుస్తున్నాయి. వీరికి సంబంధించిన కేసుల వాదనలు, పరిష్కారాలను త్వరగా పూర్తిచేసేలా నిబంధనలు అందుబాటులోకి తెచ్చారు.

■ భారత న్యాయ సహిత ప్రకారం వృద్ధుల ఆలనాపాలనా బాధ్యతలు కుమారులు, కుమార్తెలపై ఉంటుంది. వృద్ధ తల్లిదండ్రుల బాధ్యతలు వారి పిల్లలపై ఉన్నాయి. దీన్ని అతిక్రమిస్తే చట్ట ప్రకారం కారకులపై కేసులు నమోదు చేస్తారు.

■ వృద్ధులను ప్రత్యక్షంగా, పరోక్షంగా మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురిచేసినా క్రిమినల్ కేసులు నమోదు చేయవచ్చు.

మీ కోసమే ఈ పథకాలు

■ 60 ఏళ్లు నిండిన వృద్ధులకు నెలకు రూ.4000 పింఛనును పొందొచ్చు.

■ 60-80 ఏళ్ల వృద్ధులకు రూ.3లక్షల ఆదాయం ఉన్నా పన్ను రాయితీ ఉంటుంది. 80 ఏళ్లు దాటిన వారికి రూ.5 లక్షల వరకు పన్ను రాయితీ ఉంటుంది.

■ ఫిక్స్‌డ్ డిపాజిట్లపై 0.25 శాతం నుంచి 0.75 శాతం వరకు వడ్డీ రేట్లు ఎక్కువ ఉంటాయి.

■ ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం బ్యాంకు సేవల్ని వృద్ధులు ఇంటివద్దే పొందొచ్చు. వృద్ధులు బ్యాంకు కస్టమర్ సర్వీస్ విభాగాన్ని సంప్రదించాలి.

■ జీవిత బీమా సంస్థ 60-80 ఏళ్ల మధ్యనున్న వృద్ధులకు వరిష్ఠ బీమా యోజనను ప్రవేశపెట్టింది. దీని ప్రకారం వారికి 8% వంతున పదేళ్ల వరకు పింఛన్‌ను అందిస్తుంది. ఈ పథకం కింద గరిష్ఠంగా రూ.7.5 లక్షల వరకు బీమా చేసే అవకాశం ఉంది.

సమస్యల్ని వెంటనే పరిష్కరించాలి

-మద్దిలేటి, ఆళ్లగడ్డ

అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలను వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలి. ముఖ్యంగా పోలీసు, రెవెన్యూపరంగా ఏదైనా సమస్య వస్తే వెంటనే పరిష్కరించాలి. ప్రభుత్వం కూడా పలు విషయాల్లోనూ రాయితీ ఇవ్వాలి. ముఖ్యంగా ఆస్తుల క్రయవిక్రయాల్లోనూ వృద్ధులకు ఉపశమనం కలిగించాలి.

పింఛన్ల పంపిణీలో జాగ్రత్తలు పాటించండి



సమీక్షిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ జి.రాజకుమారి సిబ్బందికి సూచించారు. మంగళవారం సాయంత్రంలోగా పంపిణీ వందశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. నంద్యాల కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, ఉపాధ్యాయ అర్హత పరీక్ష, స్వర్ణాంధ్ర- 2047 ప్రణాళిక, ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 2.18 లక్షల మంది పింఛనుదారులకు రూ.92 కోట్లు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. మృతి చెందిన, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన లబ్ధిదారులకు సంబంధించిన పింఛను మొత్తాలను గత మూడు నెలల నుంచి తిరిగి జమ చేయలేదన్నారు. ఇందుకు సంబంధించిన దస్త్రాన్ని తనకు పంపాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డిని ఆదేశించారు. జిల్లాలో ఉపాధ్యాయ అర్హత పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని చెప్పారు. జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ మాట్లాడుతూ.. జిల్లాలో 29 వేల ఎకరాల ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన ప్రారంభించామని తెలిపారు. రిజిస్ట్రేషన్ జరిగిన భూములను మరోసారి తనిఖీ చేసి నివేదికలు ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు.

విద్యార్థుల ఉపన్యాసాలతో స్ఫూర్తి పొందాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : స్వర్ణాంధ్ర- 2047 విజన్ ప్రణాళికపై నిర్వహించిన పోటీల్లో పాఠశాల విద్యార్థులు ఇచ్చిన ఉపన్యాసాలతో అందరూ స్ఫూర్తి పొందాలని కలెక్టర్ జి.రాజకుమారి పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర- 2047 ప్రణాళికపై నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు నంద్యాల కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో సోమవారం జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్‌తో కలిసి ఆమె జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్వర్ణాంధ్ర సాకారం కోసం చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులను వివరిస్తూ విద్యార్థులు ప్రసంగించిన తీరు ఆకట్టుకుందన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన పాఠశాల విద్యార్థులకు ప్రశంసాపత్రాలతో పాటు జ్ఞాపికలు అందజేశారు.

మహానందిలో భారీ కొండచిలువ



మహానందిలోని అటవీ శాఖ పర్యావరణ విద్యా కేంద్రం నుంచి సోమవారం రాత్రి బీటీ రహదారిలో సుమారు 12 అడుగుల భారీ కొండచిలువ అరటి పొలాల్లోకి వెళ్తూ కనిపించింది. పాదచారులు, ద్విచక్ర వాహనదారులు, ఆటో చోదకులు కొండచిలువను ఆసక్తిగా తిలకించారు. ఆటో చోదకులు, స్నేక్ క్యాచర్ చంద్రమోహన్ కొండచిలువను పట్టుకుని సమీపంలోని అడవిలో వదిలేశారు.

- న్యూస్‌టుడే, మహానంది

నంద్యాల

• నంద్యాల • నందికొట్కూరు • శ్రీశైలం • పాణ్యం



ట్యూబ్‌లైట్లు అందజేస్తున్న కలెక్టర్ రాజకుమారి

వసతిగృహాలకు ట్యూబ్‌లైట్ల అందజేత

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులు సమకూర్చే లక్ష్యంతో రెవెన్యూ శాఖ తరపున వంద ట్యూబ్‌లైట్లు అందజేశారు. స్థానిక కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్‌తో కలిసి కలెక్టర్ జి.రాజకుమారి సోమవారం వాటిని సంక్షేమ అధికారులకు అందించారు. గణాంక కార్యాలయం సిబ్బంది సౌజన్యంతో వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఆర్వో పద్మజ, సీపీవో వేణుగోపాల్, ఉప గణాంకాధికారి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉరుసు

నంద్యాల పాతపట్టణం, గాంధీచౌక్, న్యూస్‌టుడే : పట్టణంలోని మెయిన్ బజారులో ఉన్న హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా జమాలుద్దీన్ బాద్‌షా హుసేని దర్గాలో సోమవారం ఉరుసును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలువురు భక్తులు ఫాతెహాలు చదివించారు. గాంధీచౌక్‌లోని హజరత్ సయ్యద్ గులాబ్‌షా వలి దర్గాలో గంధం మహోత్సవాన్ని నిర్వహించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
నందికొట్కూరు : 94403 61729
ఆత్మకూరు : 90149 09024
నంద్యాల : 98853 28120

నందికొట్కూరు గ్రామీణం : సమస్య : నందికొట్కూరు మండలం శాతనకోట పాఠశాల ఆవరణంలోని చేతిపంపు పనిచేయడం లేదు. **- కిశోర్, స్థానికుడు**

సమాధానం : చేతిపంపునకు మరమ్మతులు చేయిస్తాం. **- జనార్దన్, సర్పంచి**

సమస్య : కొత్తపల్లి మండలం ముసలిమడుగు బీసీకాలనీలో విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. **- రాజు, స్థానికుడు**

సమాధానం : విద్యుత్తు దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. **- జమిలాబీ, సర్పంచి**

సమస్య : కొత్తపల్లి మండలంలోని శివపురంలో ట్యాంకు నుంచి వృథాగా పోయే నీరు ప్రధాన రహదారిపై పారుతోంది. **- రమేశ్, స్థానికులు**

సమాధానం : రహదారిపై నీరు నిల్వకుండా చర్యలు చేపడతాం. **- చంద్రశేఖర్, సర్పంచి**

సమస్య : కొత్తపల్లి మండలంలోని పాతమాడుగులలో సీసీ రహదారులు లేక ఇబ్బందులు పడుతున్నాం. **- రాముడు, స్థానికుడు**

సమాధానం : ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రహదారి నిర్మాణానికి కృషి చేస్తాం. **- బాలఎల్లయ్య, సర్పంచి**

పండ్ల తోటల సాగుకు ప్రాధాన్యం

పగిడ్యాల, న్యూస్‌టుడే: ఉపాధిహామీ పథకం ద్వారా పండ్ల తోటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని ఏపీడీ అన్వారా బేగం సూచించారు.



అధికారులతో మాట్లాడుతున్న ఏపీడీ అన్వారాబేగం

మండలంలోని పగిడ్యాలలో ఉపాధిహామీ సిబ్బందితో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉపాధి కూలీలుగా నమోదైన ఐదెకరాల భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులకు మామిడి, జామ, నిమ్మ, దానిమ్మ, సీతాఫలం, మునగ, సపోటా, బత్తాయి వంటి పండ్ల తోటల సాగులో అవగాహన కల్పించాలన్నారు. ఏపీవో మద్దిలేటి, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.

ఎరువుల విక్రయాల నిలిపివేత

నంద్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే : సరైన అనుమతుల్లేని రూ.4.90 లక్షల విలువైన ఎరువుల అమ్మకాలను నిలిపివేసినట్లు ఏడీఏ రాజశేఖర్ తెలిపారు. నంద్యాల పట్టణంలోని దుర్గాభవాని ఎరువుల దుకాణాన్ని డోన్ ఏడీఏ అశోకవర్ధన్‌రెడ్డి, ఏవో ప్రసాదరావుతో కలిసి ఆయన సోమవారం తనిఖీ చేశారు. అనుమతి పత్రాలు లేని ఎరువుల విక్రయాలు నిలిపివేసినట్లు వెల్లడించారు.

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: ఎరువుల దుకాణదారులు నిబంధనలను అతిక్రమిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని తనిఖీ అధికారులు ఏడీఏలు అశోక్‌వర్ధన్‌రెడ్డి, రాజశేఖర్‌లు హెచ్చరించారు. మండలంలోని సంతజూటూరులో ఉన్న దుర్గాభవాని, తిరుమల ఎరువుల దుకాణాలను సోమవారం వారు తనిఖీ చేశారు. దుర్గాభవాని దుకాణంలో రూ.6.05 లక్షలు, తిరుమల దుకాణంలో రూ.1.79 లక్షల విలువైన ఎరువుల విక్రయాలు నిలుపుదల చేసినట్లు వెల్లడించారు. ఏవో స్వాతి, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణ ప్రణాళిక.. అక్రమాలకు వేదిక

◆ నంద్యాలలో యథేచ్ఛగా అనుమతి లేని కట్టడాలు
◆ పుర ఆదాయానికి గండి పడుతున్నా చర్యలు శూన్యం



పద్మావతి నగర్‌లో సెట్‌బ్యాక్ వదలకుండా చేపట్టిన నిర్మాణాలు

నంద్యాల పురపాలకం, రైతునగరం, న్యూస్‌టుడే : నంద్యాల జిల్లా కేంద్రమైన తర్వాత అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఈ రెండున్నరేళ్ల కాలంలో వేల సంఖ్యలో భవనాలు నిర్మించారు. వీటిలో చాలా నిర్మాణాలకు అనుమతులు లేవు. కొన్ని నిర్మాణాలను పట్టణ ప్రణాళిక విభాగం నుంచి తీసుకున్న ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మిస్తున్నారు. మరికొన్ని చోట్ల నివాస భవనం కోసం అనుమతులు తీసుకొని వాణిజ్య సముదాయాలు నిర్మిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీనివల్ల పురపాలక ఆదాయానికి గండి పడుతోంది. పట్టణ ప్రణాళిక అధికారులకు లంచాలు అందుతుండటంతోనే అనుమతి లేని కట్టడాలను పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

అనుమతికి మించి అంతస్తులు

కొందరు పట్టణ ప్రణాళిక విభాగం నుంచి ఒక ట్రెండు అంతస్తులకు అనుమతులు తీసుకొంటున్నారు. క్షేత్రస్థాయిలో నాలుగైదు అంతస్తులు నిర్మిస్తున్నారు. వీటి గురించి అధికారులకు ఫిర్యాదులు అందుతున్నా సరే చర్యలు తీసుకోవడం లేదు. పట్టణ ప్రణాళిక విభాగంలోని కొందరు సిబ్బంది అక్రమార్కులకు సహకరిస్తున్నట్లు సమాచారం. కొన్ని చోట్ల ప్రణాళిక కార్యదర్శులు అనుమతులు లేని భవనాలకు నోటీసులు ఇచ్చినా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో అక్రమ నిర్మాణాలకు అడ్డూ అదుపులేకుండాపోతోంది.



శ్రీనివాసనగర్ ప్రధాన రహదారిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనం

ఎటుచూసినా నిబంధనల ఉల్లంఘనే

● పట్టణంలోని శ్రీనివాసనగర్ ప్రధాన రహదారిలో ఓ భవనాన్ని నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఇద్దరు అన్నదమ్ములు వేర్వేరు నంబర్లతో అనుమతులు తీసుకొని ఒకే స్థలంలో ఒక్కటే భవనాన్ని నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్నారు. నిబంధనల ప్రకారం సెట్‌బ్యాక్, సెల్లార్లు, పార్కింగ్‌కు స్థలాలు వదలాలి. కానీ అటువంటివేమీ లేకుండానే నిర్మాణం జరిగిపోతున్నా అధికారులు ఇటుచూడటం లేదు. దీనిపై జులై నెలలో ఓ వ్యక్తి స.హ. చట్టం కింద దరఖాస్తు చేశారు. అతనికి అధికారుల నుంచి సరైన సమాధానం రాలేదు. దీనిపై గత సోమవారం కలెక్టరుకు కూడా ఫిర్యాదు చేశారు. ఇంత వరకు అధికారులు మాత్రం చర్యలు తీసుకోలేదు. నోటీసులిచ్చినట్లు చెబుతున్నారు.

● పద్మావతినగర్‌లో ఓ భవనాన్ని అనుమతులకు విరుద్ధంగా నిర్మిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. సెట్‌బ్యాక్ వదలకుండా నిర్మాణం చేపట్టారు. నోటీసులు ఇచ్చినట్లు స్థానిక ప్రణాళిక కార్యదర్శి చెబుతున్నారు.

● పట్టణ శివారులోని రైతునగరంలో సరైన అనుమతులు లేకుండానే ఓ ఐదంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నారు. మూడు నెలల కిందటే ప్రణాళిక కార్యదర్శి దీనిని గుర్తించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఛార్జిషీట్‌లు నమోదు చేశారు. ఉన్నతాధికారులు అంతటితో మిన్నకుండిపోయారు. దీంతో నిర్మాణం నిరాటంకంగా కొనసాగుతోంది. ఇలాంటి నిర్మాణాలు ఈ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో సాగుతున్నాయి.



రైతునగరంలో సరైన అనుమతుల్లేకుండానే చేపట్టిన కట్టడం

● పట్టణంలోని చామకాల్వ వద్ద అనుమతులకు విరుద్ధంగా భవన నిర్మాణం చకచకా సాగిపోతోంది. అధికారుల్లో మాత్రం చలనం కరవైంది.

● పట్టణంలోని ఫారూక్‌నగర్, బంగారుపుట్ట వద్ద అనుమతులు లేకుండానే భవన నిర్మాణాలు పూర్తవుతున్నా నోటీసులిచ్చి చేతులు దులిపేసుకున్నారు.

● ఎన్జీవోస్ కాలనీ, ఎస్బీఐ కాలనీ, పద్మావతినగర్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో ప్లాన్ ఒకలాగా నిర్మాణం ఇంకోలా నిర్మిస్తున్నా అధికారులు ముడుపులు తీసుకొని చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

పట్టించుకోని సచివాలయ కార్యదర్శులు

ప్రతి వార్డులోని సచివాలయంలో ప్రణాళిక కార్యదర్శులు ఉన్నారు. ఆ వార్డు పరిధిలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై వారికి సమాచారం ఉన్నాసరే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం లేదన్న విమర్శలున్నాయి. కొందరు నిర్మాణదారుల నుంచి డబ్బు తీసుకుని అనుమతి లేని కట్టడాలను చూసీచూడనట్లు వదిలేస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

కేసులు నమోదు చేశాం

- నరసింహమూర్తి, పట్టణ ప్రణాళిక విభాగం అధికారి

నంద్యాల పట్టణంలో నూతన నిర్మాణాలు చేపట్టే వారు అనుమతులు తీసుకోవాలి. అనుమతులకు అనుగుణంగానే కట్టడాలు చేపట్టాలి. అందుకు విరుద్ధంగా నిర్మిస్తే చర్యలు తీసుకుంటాం. అవసరమైతే అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తాం. ఇప్పటికే వందకు పైగా కేసులు నమోదు చేశాం.

చేపకు గాలం.. ప్రాణాలతో చెలగాటం

నంద్యాల పట్టణం నుంచి నందమూరినగర్‌కు వెళ్లే దారిలో కుందూనదిపై ఉన్న పాత వంతెనపై కొందరు ప్రమాదకరంగా చేపల వేట సాగిస్తున్నారు. అసలే ఈ వంతెన ఇరుకుగా ఉంది. పైగా దారంతా గుంతలు ఏర్పడ్డాయి. వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు వంతెన అంచుల్లో ప్రయాణిస్తుంటాయి. చేపల వేట సాగించే వారు వంతెన అంచుల్లో బలహీనంగా ఉన్న రక్షణ కడ్డీల ఊతంతో నదిలోకి వంగి గాలం వేస్తున్నారు. పట్టు తప్పి నీటిలోకి పడిపోయినా.. వంతెనపై ప్రయాణించే వాహనాలు ఢీకొన్నా ప్రాణాలుపోయే ప్రమాదం ఉంది.

– న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం



ఉర్దూ పాఠశాలల అభివృద్ధికి చర్యలు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : ఉర్దూ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. ఉర్దూ మాధ్యమ విద్యార్థులకు ఉపయోగపడేలా రూటా ఆధ్వర్యంలో ముద్రించిన బ్యానర్లను సోమవారం ఆయన స్థానిక తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ బ్యానర్లను అన్ని ఉర్దూ



బ్యానర్లు ఆవిష్కరిస్తున్న మంత్రి ఫరూక్

పాఠశాలలకు పంపించనున్నట్లు ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు మోమిన్ సైపుల్లా తెలిపారు. కార్యక్రమంలో తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, ఉర్దూ పాఠశాలల తనిఖీ అధికారి అస్మద్దీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ కలాం, సంఘం నాయకులు జక్రియా అలీఖాన్, షేక్ మున్నా, కలీముల్లా, యూనస్, నూరుల్లా తదితరులు పాల్గొన్నారు.

దారికడ్డుగా ఉన్న స్తంభం తొలగింపు

స్పందనకు వందనం

నంద్యాల బొమ్మలసత్రం న్యూస్‌టుడే : మండల కేంద్రం వెలుగోడులోని ద్వారకానగర్‌లో రహదారి మధ్య ఉన్న విద్యుత్తు స్తంభాన్ని ఆ శాఖ అధికారులు తొలగించారు. దారికి అడ్డంగా స్తంభం ఉండటంతో కాలనీలోకి ఆటోలు, అంబులెన్సులు కూడా రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వారి సమస్యలపై 'ఈనాడు'లో సోమవారం 'స్తంభం.. రాకపోకలకు అడ్డం' శీర్షికన చిత్ర కథనం ప్రచురితమైంది. స్పందించి విద్యుత్తు శాఖ అధికారులు పాత స్తంభాన్ని తొలగించారు. కొత్త స్తంభాన్ని పక్కన ఏర్పాటు చేశారు.



కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

హాకీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా చాణక్యరాజు

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : హాకీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా నంద్యాలకు చెందిన విశ్రాంత డీఎఫ్‌వో చాణక్యరాజు ఎన్నికయ్యారు. గుంటూరులో ఆదివారం జరిగిన సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నంద్యాల ఎస్పీజీ పాఠశాలలో సోమవారం ప్రధానోపాధ్యాయురాలు జీవలత, కళాశాల ప్రిన్సిపల్ దివాకర్, వ్యాయామ ఉపాధ్యాయులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. రవికుమార్, సభ్యులు విశ్వనాథ్, శ్రీనివాసరెడ్డి, శ్రీధర్, బాబు, విజయలక్ష్మి, సంజీవ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూఏ బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనే జేఎన్‌టీయూఏ జట్లను ఎంపిక చేసినట్లు జేఎన్‌టీయూఏ క్రీడా సంచాలకులు జ్యోజిరెడ్డి తెలిపారు.



మహిళా జట్టును అభినందిస్తున్న జ్యోజిరెడ్డి, సుబ్రహ్మణ్యం

శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం బాల్ బ్యాడ్మింటన్ మహిళలు, పురుషుల జట్ల ఎంపికకు పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో 30 కళాశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ చూపిన వారిని జట్లకు ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరు నవంబరులో తమిళనాడులోని అలగప్ప విశ్వవిద్యాలయంలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం, పీడీ చంద్రారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

తైక్వాండో ఎంపిక పోటీలు ప్రారంభం

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 బాల బాలికల ఉమ్మడి జిల్లా తైక్వాండో ఎంపిక పోటీలు స్థానిక డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో సోమవారం ప్రారంభమయ్యాయి. ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డా.రవికృష్ణ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా తైక్వాండో రాష్ట్ర కార్యదర్శి చంద్రమౌళి, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ క్రీడల వల్ల విద్యార్థులకు విద్య, ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. పీఈటీల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల

మధ్యంతర భృతి ప్రకటించాలి

గడివేముల, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు వెంటనే మధ్యంతర భృతి ప్రకటించాలని ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు కోరారు. ఈనెల 6న విజయనగరంలో నిర్వహించనున్న ఏపీటీఎఫ్ మహాసభలకు సంబంధించిన గోడపత్రాలను గడిగరేవుల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో సోమవారం విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన జాతీయ విద్యావిధానం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా విధానాలపై మహాసభల్లో చర్చించి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని తెలిపారు. ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి కవిత, మండల అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, కార్యదర్శి బాలస్వామి, రాంపుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించండి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : జిల్లాలో మొక్కజొన్న పంట పండించిన రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న డిమాండ్ చేశారు. నంద్యాల కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఐ, రైతు సంఘం నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ రాజకుమారికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలోని ఆళ్లగడ్డ, బనగానపల్లి, ఆత్మకూరు, పాణ్యం నియోజకవర్గాల్లో సుమారు 20 వేల హెక్టార్లలో మొక్కజొన్న పంట సాగుచేసినట్లు తెలిపారు. మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే దిగుబడులు కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బాబాఫకృద్దీన్, బాలకృష్ణ, హరినాథ్, జిలానీబాషా, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఫరూక్‌ను కలిసిన ఆబ్కారీ అధికారులు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను నంద్యాల ఎక్సైజ్ సీఐలు కృష్ణమూర్తి, లక్ష్మణ్‌దాసు, ఎస్సై బ్రహ్మయ్య కలిశారు. స్థానిక మంత్రి కార్యాలయంలో సోమవారం వారు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వ కృషి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : మైనారిటీల సంక్షేమం, విద్యాభివృద్ధి, పాఠశాలల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ పేర్కొన్నారు. సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనారిటీస్, మైనారిటీ సంక్షేమ శాఖ సంయుక్తంగా ప్రచురించిన టెట్-2024 ఎస్జీటీ ఉచిత అభ్యసన సామగ్రిని ఆయన ఆవిష్కరించారు. ప్రారంభించారు. స్థానిక జోయ ఉర్దూ శిక్షణ కేంద్రం సౌజన్యంతో రాజేశ్వరి శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన అభ్యర్థులకు వాటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు అంజద్ షరీఫ్, అబ్దుల్ అజీజ్, హాఫిజ్ అంజాద్‌బాషా సిద్దిఖీ, గంగాధర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

వినాయకుడికి ఎమ్మెల్యే పూజలు

నందికొట్కూరు, న్యూస్‌టుడే: నందికొట్కూరు పట్టణ శివారు ఆత్మకూరు రహదారిలో బయటపడ్డ పురాతన వినాయక విగ్రహానికి ఎమ్మెల్యే గిత్తా జయసూర్య సోమవారం పూజలు నిర్వహించారు. కౌన్సిలర్లు, ఉత్సవ కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.



వినాయక విగ్రహానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

☛ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఉద్యోగ మేళాను ఎమ్మెల్యే గిత్తా జయసూర్య సోమవారం ప్రారంభించారు. కళాశాల ప్రధానాచార్యురాలు సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

☛ దసరా పండగ నేపథ్యంలో పట్టణంలోని శమీవృక్షం వద్ద జరుగుతున్న పనులను ఎమ్మెల్యే గిత్తా జయసూర్య సోమవారం పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలని పురపాలక అధికారులకు సూచించారు.

☛ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను ఎమ్మెల్యే ప్రాంభించారు.

కాలనీ కబుర్లు

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : పాణ్యం మండలంలో పనిచేస్తున్న రీసర్వే ఉప తహసీల్దారు మహేశ్వరరెడ్డి, కార్యాలయ సబార్డినేట్ గోపాల్ సోమవారం బదిలీ అయ్యారు. వారిని తహసీల్దారు నరేంద్రనాథ్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది సత్కరించారు.

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : ఉపాధిహామీ పథకం కింద చేపట్టేందుకు గ్రామాల్లో పనులు గుర్తించాలని ఏపీవో విజయరాణి సూచించారు. పాణ్యం ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఉపాధిహామీ సిబ్బంది, క్షేత్ర సహాకులతో సమావేశం నిర్వహించారు.

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : పాణ్యం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్థలాన్ని కేటాయించాలని విద్యార్థి సంఘం నాయకుడు ప్రతాప్ కోరారు. నంద్యాలలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఈమేరకు వినతిపత్రం అందజేశారు.

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : పాణ్యం మండలం చెంచుకాలనీలో జాతీయ రహదారి కోసం స్థలం కోల్పోయిన గిరిజన మహిళ సాలిబాయికి ప్రభుత్వం నష్ట పరిహారం అందించాలని జీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ డిమాండ్ చేశారు. ఈమేరకు జీపీఎస్ నాయకులు, బాధితురాలు సోమవారం నంద్యాలలో కలెక్టర్ రాజకుమారిని కలిసి వినతిపత్రం అందజేశారు.

గడివేముల, న్యూస్‌టుడే : విద్యార్థినులు నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై నాగార్జునరెడ్డి సూచించారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో సోమవారం విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు.

గడివేముల, న్యూస్‌టుడే : రబీలో సాగు చేసేందుకు రాయితీపై శనగ విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి హేమసుందరరెడ్డి సోమవారం తెలిపారు. మండలానికి 300 క్వింటాళ్ల శనగలు కేటాయించినట్లు చెప్పారు. వీటిని 25 శాతం రాయితీతో రైతులకు ఇవ్వనున్నట్లు వివరించారు.

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : మండల ప్రజలు చెప్పిన ప్రతి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తహసీల్దారు నరేంద్రనాథ్‌రెడ్డి చెప్పారు. మండలంలోని తమ్మరాజుపల్లెలో ఎస్సై నరేంద్రకుమార్‌రెడ్డితో కలిసి సోమవారం ఆయన ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు.

వెలుగోడు, న్యూస్‌టుడే : ద్వారకానగర్‌లో సోమవారం నిర్వహించనున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి పాల్గొననున్నట్లు తెదేపా నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు.

వెలుగోడు, న్యూస్‌టుడే : మండలంలో జరిగిన పంట నమోదు సూపర్ చెక్ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు ఏవో పవన్‌కుమార్ సోమవారం తెలిపారు. మండలంలో వంద శాతం పంట నమోదు పూర్తి చేసినట్లు చెప్పారు.

వెలుగోడు, న్యూస్‌టుడే: డీలర్లు కృత్రిమ ఎరువుల కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని ఏవో పవన్‌కుమార్ హెచ్చరించారు. వెలుగోడు మండలంలోని పలు ఎరువుల దుకాణాలను సోమవారం తనిఖీ చేశారు.

వెలుగోడు, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలకు 1996- 97లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం ఇన్వర్టరు, బ్యాటరీలను అందజేశారు.

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే : ప్రజలు చట్టాలపై అవగాహన కలిగుండాలని ఎస్సై జగన్‌మోహన్ సూచించారు. స్థానిక ఎస్సీ కాలనీవాసులతో సోమవారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

కొత్తపల్లి, న్యూస్‌టుడే: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగుండాలని ఎస్సై కేశవ సూచించారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం బాల్య వివాహాలు, బాలికల చట్టాలు, సైబర్ నేరాలపై విద్యార్థులకు వివరించారు.

బాధలు వినండి.. భరోసా ఇవ్వండి

అధిక పింఛనిచ్చి ఆదుకోండి

పాణ్యంకు చెందిన శివకుమార్, ఎల్లా సుబ్బమ్మ కుమారుడు నాగశేషుకు పదేళ్ల వయసు. ఈ బాలుడు పుట్టుకతోనే మానసిక దివ్యాంగుడు. కదల్లేని స్థితిలో పూర్తిస్థాయిలో మంచానికే పరిమితమయ్యాడని తల్లిదండ్రులు చెబుతున్నారు. ఇద్దరిలో ఒకరు ఇంటివద్దే ఉండి బాగోగులు చూసుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రస్తుతం ఇస్తున్న దివ్యాంగుల పింఛను సరిపోవడం లేదంటున్నారు. అధిక పింఛనుకు అర్హుడైనా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టరైనా స్పందించి అధిక పింఛను వచ్చేలా చూడాలని వీరు కోరుతున్నారు.



నంద్యాల బొమ్మలసత్రం, నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే : పేదరికం.. అనారోగ్యంతో జీవన పోరాటం చేస్తున్న వారు చేయూత కోసం ఎదురు చూస్తున్నారు. ఎలాంటి జీవనాధారం లేని తమకు పింఛను మంజూరు చేసి ఆర్థిక భరోసా కల్పించాలని వేడుకుంటున్నారు. అనారోగ్యం, వైకల్యంతో మంచానపడిన వారు అధిక పింఛను ఇచ్చి ఆదుకోవాలంటున్నారు. వార్డు సచివాలయం నుంచి కలెక్టరేట్ వరకు అధికారుల చుట్టూ తిరుగుతూ వినతిపత్రాలు అందించినా ప్రయోజనం లేదని వాపోతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి పింఛన్లు మంజూరు చేయాలని విన్నవిస్తున్నారు.

40 ఏళ్లుగా మంచానికే పరిమితం

నంద్యాల పట్టణం అలీనగర్‌కు చెందిన దూదేకుల నరసింహులు, మౌలాబీ దంపతుల కుమారుడు రియాజ్ వయసు 40 ఏళ్లు. పుట్టుకతోనే పోలియో బారినపడిన ఈయన స్వతహాగా కదల్లేని పరిస్థితి. నాలుగు దశాబ్దాలుగా మంచానికే పరిమితమైన ఇతనికి రూ.6 వేల పింఛను వస్తోందని తండ్రి చెబుతున్నారు. అధిక పింఛనుకు అన్ని అర్హతలున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. గత మూడు నెలలుగా కుమారుడిని ఎత్తుకుని వార్డు సచివాలయం చుట్టూ తిరుగుతున్నా స్పందన లేదంటున్నారు. సోమవారం కలెక్టర్ కలిసి పింఛను మొత్తం పెంచాలని కోరినట్లు ఈయన వెల్లడించారు.



అర్హతలున్నా అన్యాయమే..

కొత్తపల్లి చెంచుగూడేనికి చెందిన బయమ్మ పుట్టుకతోనే పోలియో బారినపడ్డారు. రెండు కాళ్లు పనిచేయవు. మొదట్లో ప్రభుత్వ పథకాలపై అవగాహన లేక పింఛనుకు దరఖాస్తు చేసుకోలేదు. గత ఐదేళ్లుగా తనకు దివ్యాంగుల పింఛను ఇచ్చి ఆదుకోవాలంటూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదని ఈమె ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తమ గూడేనికి వచ్చిన అప్పటి ఎమ్మెల్యే ఆర్థర్‌కు తమ కష్టాన్ని మొరపెట్టుకున్నా ఫలితం లేదని ఈమె వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు తనకు దివ్యాంగుల పింఛను వచ్చేలా చూడాలని వేడుకుంటున్నారు.



చిన్న చెరువులో శిశువు మృతదేహం

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే : పట్టణ శివారులోని చిన్న చెరువులో సోమవారం ఓ శిశువు మృతదేహం లభ్యమైంది. గుర్తించిన స్థానికులు పురపాలక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు శిశువు మృతదేహాన్ని బయటకు తీసి ఖననం చేసినట్లు వెల్లడించారు. మృతి చెందడంతో ఇక్కడ పడేశారా.. లేక బతికుండగానే తెచ్చి చెరువులో వేశారా అని ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

చాపిరేవులలో చోరీ

చాపిరేవుల (నంద్యాల గ్రామీణం), న్యూస్‌టుడే : మండలంలోని చాపిరేవులకు చెందిన శ్రీనివాసులు ఇంట్లో చోరీ జరిగినట్లు గ్రామీణ సీఐ అస్రార్‌బాషా సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన శ్రీనివాసులు రెండు రోజుల కిందట ఇంటికి తాళం వేసి రుద్రవరం వెళ్లారు. ఇది గమనించిన దొంగలు శనివారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. ఆదివారం తిరిగొచ్చిన ఆయన దొంగతనం జరిగినట్లు గుర్తించారు. బంగారు, వెండి నగలు అపహరించారని సోమవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు

జూపాడుబంగ్లా, న్యూస్‌టుడే : జూపాడుబంగ్లాలోని తంగడంచ విత్తనోత్పత్తి క్షేత్రం భూముల్లో అక్రమ నిర్మాణాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఏడీఏ అరుణలత హెచ్చరించారు. ఓ వెల్డింగ్ దుకాణ నిర్వాహకుడు తన దుకాణం పక్కనే ఉన్న తంగడంచ ఫారం సరిహద్దుల్లో పొక్లెయిన్‌తో చెట్లు, చెత్తను తొలగించి చదును చేస్తుండగా వ్యవసాయ అధికారులతో కలిసి ఏడీఏ పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనులను నిలిపివేశారు. ఏవో శ్రావణి పాల్గొన్నారు.

ఆబ్కారీ సీఐగా రామాంజనేయులు

నందికొట్కూరు, న్యూస్‌టుడే: నందికొట్కూరు ఎక్సైజ్ సీఐగా రామాంజనేయులు సోమవారం బాధ్యతలు చేపట్టారు. కోడుమూరు ఎక్సైజ్ సీఐగా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు.

అనుభవంలోని భూములకు పట్టాలివ్వాలని వినతి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఈర్నపాడులోని సర్వే నంబరు 542లో పేదల అనుభవంలో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, నాయకుడు వీరన్న కోరారు. ఆత్మకూరు ఆర్డీవో మిరియాల దాసుకు సోమవారం వినతిపత్రం అందజేశారు.

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

ముఖ్యమంత్రితో ఎమ్మెల్యే భేటీ



ముఖ్యమంత్రితో ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సోమవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమయ్యారు. ఆళ్లగడ్డలో 100 రోజుల్లో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు చంద్రబాబుకు వివరించారు. గత ఐదేళ్లలో ఆళ్లగడ్డలో అభివృద్ధి పూర్తిస్థాయిలో ఆగిపోయిందని, తిరిగి ప్రగతి బాట పట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆళ్లగడ్డ అభివృద్ధికి పూర్తిగా సహకరిస్తానని సీఎం హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.

రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయండి

బనగానపల్లి, న్యూస్‌టుడే: ఏపీటీఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆశాఖ జిల్లా అధ్యక్షుడు బి.మాధవస్వామి కోరారు.



గోడపత్రికలు విడుదల చేస్తున్న మాధవస్వామి, ఇతర నాయకులు

సోమవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మహాసభల గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీటీఎఫ్ ఏర్పాటై 80 ఏళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజయనగరంలో అక్టోబరు 6 నుంచి 8 వరకు మహాసభలు నిర్వహిస్తామని తెలిపారు. రామకృష్ణ, జె.వెంకటకృష్ణుడు, అనిల్ కుమార్, బ్రహ్మయ్య, పుల్లయ్య, రామస్వామి, రామ్‌మోహన్ రెడ్డి, సుందరం, బాలాజీ నాయక్, రామసుబ్బయ్య, మధు, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు పట్టణంలో విద్యుత్తుకోత

డోన్, న్యూస్‌టుడే: పోలీస్‌స్టేషన్, డీఎస్పీ కార్యాలయం, పోస్టాఫీసు, ఎస్‌బీఐ పాఠశాల, రాజా టాకీస్ ప్రాంతాల్లో విద్యుత్తుకోత ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి తెలిపారు. నేటి ఉదయం 10 గంటల నుంచి 2 వరకు సరఫరాలో కోత విధిస్తున్నామని, నెహ్రూనగర్, టీఆర్ నగర్, తెదేపా కార్యాలయం, నారాయణపాఠశాల ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్తు ఉండదన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574316
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లి: 80085 73763

బనగానపల్లి: సమస్య: జుర్రేరు వాగు వంతెనకు గుంతలు పడ్డాయి. –శ్రీనివాసరెడ్డి.
సమాధానం: తగు చర్యలు తీసుకుంటాం. –హుసేని, ఆర్‌అండ్‌బీ ఏఈ.
కోవెలకుంట్ల గ్రామీణం: సమస్య: సాయినగర్ నుంచి టీఆర్ కాలని వరకు కాలువలు లేకపోవడంతో రోడ్లన్నీ పాడవుతున్నాయి. కాలువలు ఏర్పాటు చేయాలి. –రాజు.
సమస్య: కోవెలకుంట్ల నుంచి బనగానపల్లె రహదారిలో ఇరుకుల బట్టీ సమీపంలో మురుగు కాలువలు లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కాలువలు నిర్మించాలి. –గిరి.
సమాధానం: కాలువలు నిర్మిస్తాం. –జీఆర్ సూర్యనారాయణ రెడ్డి, ఉప సర్పంచి.

అధ్వాన దారి.. అవస్థలు తీరవా మరి

బనగానపల్లి, న్యూస్‌టుడే: రవ్వల కొండ...రాష్ట్రస్థాయిలో పేరొందిన పర్యాటక కేంద్రం. పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి నడయాడిన గడ్డ. కాలజ్ఞానాన్ని గుహలో కూర్చొని ముందే రాసిన చరిత్ర ఇక్కడ ఉంది. ఈ గుహను చూసేందుకు నిత్యం పర్యాటకులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇంతటి చరిత్ర ఉన్న రవ్వలకొండకు వెళ్లే రహదారి అధ్వానంగా మారడంతో అవస్థలు ఎదురవుతున్నాయి. గతంలో ఆదర్శపాఠశాల పక్కనే ఉన్న రోడ్డుపై నుంచి పర్యాటకులు వెళ్లేవారు. గాలేరు, నగరి సుజల స్రవంతి కాలువ రవ్వలకొండ మీదుగా వెళ్లడంతో తాత్కాలికంగా మట్టిరోడ్డును వేశారు. గాలేరు, నగరి కాలవపై చిన్నపాటి వంతెన నిర్మించి అక్కడి నుంచి కొండపైకి వెళ్లేందుకు దారిని నిర్మించారు. ఇలా తాత్కాలికంగా దారి వేసి పదేళ్లవుతున్నా శాశ్వత రోడ్డును నిర్మించలేకపోయారు. కొండపై ప్రమాదకర మలుపు మార్గంలోనే పర్యాటకులు రాకపోకలు సాగిస్తున్నారు. రోడ్డును వెడల్పు చేసి శాశ్వత రహదారిని నిర్మించాల్సి ఉండగా ఎవరూ పట్టించుకోవడం లేదు. గత ప్రభుత్వం అయిదేళ్లలో ఒక్క రూపాయి కూడా విదల్చకపోవడంతో అందరికీ కష్టాలే ఎదురవుతున్నాయి. కూటమి ప్రభుత్వమైనా దృష్టి సారించాలని పర్యాటకులు కోరుతున్నారు.



గుహను చూసి వస్తున్న పర్యాటకులు

ప్రతిపాదనలకే పరిమితం

శాశ్వత రోడ్డు నిర్మాణానికి గానూ మూడేళ్ల కిందట సుమారు రూ.2 కోట్లు అవసరమవుతాయని అధికారులు ప్రతిపాదనలు పంపించారు. నిధులు మంజూరు కాక పోవడంతో తారురోడ్డు పనులు ప్రారంభించలేకపోయారు. దీనిపై 'న్యూస్‌టుడే' పంచాతీరాజ్ డీఈ నాగశ్రీనివాసుల దృష్టికి తీసుకెళ్లగా రోడ్డును చదును చేశామని నిధులు మంజూరైతే కొత్తగా రోడ్డు పనులు ప్రారంభిస్తామన్నారు.



రవ్వలకొండపై నుంచి వస్తున్న పర్యాటకుల వాహనం

రోడ్డు నిర్మిస్తే ఎంతో అభివృద్ధి
–రఘురామిరెడ్డి



రవ్వలకొండకు నిత్యం భక్తులు, పర్యాటకులు రాకపోకలు సాగిస్తుంటారు. సెలవు రోజుల్లో రాష్ట్రం నలుమూలల నుంచి పర్యాటకులు వస్తుంటారు. రోడ్డు చూస్తే దుమ్ము ధూళితో ఉంది. ద్విచక్రవాహనంపై కొండపైకి వెళ్లాలన్నా కష్టంగా ఉంది. ఎంతో పేరున్న ఈ కేంద్రానికి రోడ్డు లేకపోవడం దురదృష్టకరం. కూటమి ప్రభుత్వమైనా రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాలి.

మనోహరం..ఉమామహేశ్వరుడి పల్లకి ఉత్సవం

యాగంటి (బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం కనుల పండువగా ఉమామహేశ్వరుడి పల్లకి ఉత్సవం నిర్వహించారు. ఉత్సవవిగ్రహాలను పల్లకిలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు.



పల్లకి ఉత్సవంలో భక్తులు

దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు

అవుకు, న్యూస్‌టుడే: ఈనెల 3 నుంచి ప్రారంభం కానున్న దసరా వేడుకలకు సంబంధించి ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఆర్యవైశ్య సంఘ నాయకులు సోమవారం వేడుకల వివరాలు వెల్లడించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు మేడం ఆంజనేయులు, తాళేపల్లి నాగేంద్ర, సన్నితి శ్రీనివాసులు. మల్లేల సునీల్ తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిల్ అజెండాపై వివాదం

12వ అంశం రద్దుపై తెదేపా వైస్-ఛైర్మన్ నిలదీత

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: ఓ కౌన్సిలర్ మూడు సార్లు సమావేశానికి హాజరు కాలేదనే అంశంపై వివాదం జరిగింది. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో పురపాలక ఛైర్మన్ సప్తశైల రాజేష్ అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. 13 అంశాలను కౌన్సిల్ ఎదుట ఉంచారు. 12వ అంశం కింద పురపాలక కౌన్సిల్ 13వ వార్డు కౌన్సిలర్ టీఈ దినేష్‌గౌడ్ వరుస సమావేశాలకు రావడం లేదని ఉంచారు. తనకు ఎటువంటి నోటీసు ఇవ్వకుండా అజెండాలో ఎలా పొందుపరుస్తారని ఆయన ప్రశ్నించారు. ఛైర్మన్ రాజేష్ స్పందించి ఈ అంశం తనకు తెలియకుండా అజెండాలో పెట్టారనడంతో మొదటి పత్రంలో సంతకం పెట్టించుకున్నప్పుడు ఈ అంశాన్ని ప్రస్తావించలేదని, తర్వాత అజెండా ఎలా రూపొందించారని కమిషనర్ ప్రసాద్‌గౌడ్‌ను ఛైర్మన్ ప్రశ్నించారు. ఆయన సమాధానమివ్వక నీళ్లు నమిలారు. తనకు తెలియకుండా, కౌన్సిలర్‌కు ఎటువంటి నోటీసు ఇవ్వకుండా అజెండాలో అంశాన్ని చేర్చడంపై దీన్ని రద్దుపరచాలని ఛైర్మన్ చెప్పడంతో సభ్యులు ఆమోదించారు. 12 తర్వాత 13వ అంశం ఉందని, అన్ని అంశాలను చదివిన తర్వాతనే సంతకం పెడతారు కదా..ఆ అంశాన్ని ఎందుకు రద్దు చేస్తారని తెదేపా వైస్ ఛైర్మన్ కొత్రికె హరికిషన్ కౌన్సిల్‌లో నిలదీశారు. ఇంకోసారి ఇటువంటి పొరపాట్లు లేకుండా చూడాలని, చివరి పేజీలో కూడా ఇప్పటినుంచి తనతో సంతకం తీసుకోవాలని ఛైర్మన్ కమిషనర్‌ను ఆదేశించారు. 13వ వార్డు కౌన్సిలర్ కౌన్సిల్ సమావేశానికి ముందు రిజిస్టర్‌లో సంతకం ఛైర్మన్ ఛాంబర్‌లో పెట్టడంపై తెదేపా వైస్ ఛైర్మన్ హరికిషన్ అభ్యంతరం వ్యక్తం చేశారు.



కౌన్సిల్‌లో నిలదీస్తున్న తెదేపా వైస్ ఛైర్మన్ కొత్రికె హరికిషన్

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి

బేతంచెర్ల, న్యూస్‌టుడే: అన్ని వార్డుల్లో ప్రజా సమస్యలపై దృష్టి సారించి వాటిని పరిష్కరించాలని నగర పంచాయతీ ఛైర్మన్ శేషాచలంరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ హరిప్రసాద్ అధ్యక్షతన వార్డు కౌన్సిల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు.



మాట్లాడుతున్న ఛైర్మన్ శేషాచలంరెడ్డి

ముందుగా అభివృద్ధి నివేదికలను ఇంజనీరింగ్ అసిస్టెంట్ చదివి వినిపించారు. పట్టణంలో పలు కాలనీల్లో నెలకొన్న తాగునీరు, డ్రైనేజీ, సీసీరహదారుల నిర్మాణం, తాగునీటి గొట్టాల లీకేజీలు, తాగునీరు కలుషితం తదితర వాటిపై కౌన్సిలర్లు ఛైర్మన్ దృష్టికి తెచ్చారు. ఛైర్మన్ మాట్లాడుతూ ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యలను నోట్ చేసుకొని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. నగర పంచాయతీ కౌన్సిలర్లు అంజి, చింత నాగిరెడ్డి, ఇబ్రహీం, పోలూరు ఆదిలక్ష్మి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

భగత్‌సింగ్ విగ్రహం ఏర్పాటు చేయాలి

డోన్, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య పోరాటయోధుడు భగత్‌సింగ్ విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇచ్చేలా చూడాలని సీపీఐ కౌన్సిలర్ సుంకయ్య, మండల కార్యదర్శి నారాయణ, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి రంగస్వామి తదితరులు ఛైర్మన్ రాజేష్, వైస్‌ఛైర్మన్ హరికిషన్‌లకు వినతిపత్రం అందజేశారు. కౌన్సిల్‌లో తీర్మానం చేసి ఆమోదించేలా చూడాలన్నారు.

నీటి వృథా.. తీరని వ్యథ



కోవెలకుంట్ల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండులో తాగునీరంతా వృథా అవుతోంది. ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత కూలింగ్ వాటర్ కేంద్రం వద్ద బిరడా సక్రమంగా లేకపోవడంతో వృథా అవుతోందని, అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.
–న్యూస్‌టుడే, కోవెలకుంట్ల గ్రామీణం

వృథాగా రాళ్లు



ఆర్‌ఎస్ రంగాపురం ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో గ్రానైట్ రాళ్లను పడేశారు. వాటిలో చాలా వరకు దెబ్బతిన్నాయి. ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు మొదలు పెట్టక ముందే సర్వే పూర్తయిన చోట ఈ గ్రానైట్ రాళ్లను పాతించాల్సి ఉండగా అధికారులు పట్టించుకోవడంతో ఇలా వృథాగా మారాయి.
–న్యూస్‌టుడే, ఆర్‌ఎస్‌రంగాపురం(బేతంచెర్ల)

ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా వరలక్ష్మి

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: డోన్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా బి.వరలక్ష్మి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె ఇంటలిజెన్స్ వింగ్ వైఎస్సార్ జిల్లా నుంచి డోన్‌కు బదిలీపై వచ్చారు. ఎక్సైజ్ ఎస్సైలుగా ఓ.సోమశేఖర్ రావు, పి.దౌలత్‌ఖాన్ సోమవారం బాధ్యతలు చేపట్టారు.

ఘనంగా క్రిస్టియన్ ఐకాస ఆవిర్భావ దినోత్సవం

డోన్, న్యూస్‌టుడే: క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కార్యాలయంలో ఐకాస అధ్యక్షుడు ఆదాం కేకు కోసి సంబరాలు జరిపారు. కేంద్ర కమిటీ పిలుపు మేరకు ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఐకాస ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, కార్యదర్శి జాన్సన్, యాదగిరి, జానా ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు పరీక్షలు

ప్యాపిలి, న్యూస్‌టుడే: కాలానుగుణ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్‌వో విజయకుమారి, ఆరోగ్య విద్యాబోధకుడు రాఘవేంద్ర గౌడు విద్యార్థినులకు సూచించారు. పట్టణంలోని కస్తూర్బా పాఠశాల, జూనియర్ కళాశాలలోని 56 మంది విద్యార్థినులకు సోమవారం హెల్త్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు.

డోన్ డివిజనల్ అభివృద్ధి అధికారిగా నరసింహారెడ్డి



నరసింహారెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

డోన్, న్యూస్‌టుడే: పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ తరఫున డోన్ డివిజన్‌కు డివిజనల్ అధికారిగా నరసింహరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీవో శ్రీనివాసులు, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

చురుగ్గా కార్యకర్తలు పనిచేయాలి

డోన్, న్యూస్‌టుడే: తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు మరింత చురుగ్గా పనిచేయాలని తెదేపా రాష్ట్రకార్యదర్శి వలసలరామకృష్ణ, మండల అధ్యక్షుడు సలీంద్ర శ్రీనివాసులు అన్నారు. సోమవారం స్థానిక తెదేపా కార్యాలయంలో మండలంలోని నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ప్రజల్లో తెదేపా పార్టీపై మంచి స్పందన వచ్చిందని, ప్రభుత్వం మంచి పాలన ఇస్తుందనే నమ్మకం రావటంతో తెదేపాలోకి చేరే వారం దరికీ సభ్యత్వం నమోదు చేయించేలా చూడాలన్నారు. తెదేపా నాయకులు ఓబులాపురంశేషిరెడ్డి, గంధంశ్రీను, శ్రీరాములు, జిలేబి ధను, గోవిందరెడ్డి పాల్గొన్నారు.

శివలింగాన్ని తాకిన సూర్యకిరణాలు

పలుకూరు(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: బనగానపల్లి మండలం పలుకూరులోని రామేశ్వరస్వామి ఆలయంలోని శివలింగాన్ని సోమవారం సూర్యకిరణాలు తాకాయి. ప్రతి ఏటా సూర్యకిరణాలు ఇలా తాకుతాయని అర్చకులు తెలిపారు.



శివలింగంపై పడిన సూర్యకిరణాలు

మద్దిలేటిస్వామి, అమ్మవారి హుండీ లెక్కింపు

ఆర్‌ఎస్ రంగాపురం(బేతంచెర్ల), న్యూస్‌టుడే: ఆర్‌ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన మద్దిలేటి నరసింహ స్వామి, అమ్మవార్లకు భక్తులు సమర్పించిన కానుకల హుండీ ఆదాయం లెక్కింపు జరిపినట్లు ఈవో, ఉప కమిషనర్ రామాంజనేయులు తెలిపారు. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ చక్రభరత్ ఆధ్వర్యంలో నిర్వహించిన హుండీ లెక్కింపులో రూ.12.24 లక్షల నగదు, 7 గ్రాముల 354 మిల్లీ గ్రాముల బంగారం, 750 గ్రాముల వెండి వచ్చినట్లు ఈవో తెలిపారు.



నగదు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

పల్లె కబుర్లు

కోవెలకుంట్ల గ్రామీణం: అమడాల: అమడాల మెట్ట నుంచి చర్చి వరకు వీధి దీపాలు వెలగడం లేదు. అధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగేలా చూడాని గ్రామస్థులు కోరుతున్నారు.

చిన్నకొప్పెర్ల: చిన్నకొప్పెర్లలో చర్చి వద్ద మురుగు కాలువ పొంగడంతో రోడ్డంతా అపరిశుభ్రంగా మారింది. సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

డోన్, న్యూస్‌టుడే: విధుల్లో అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు లభిస్తుందని డోన్ డివిజనల్ అభివృద్ధి అధికారి నరసింహారెడ్డి అన్నారు. వెంకటాపురం పంచాయతీ కార్యదర్శి ఉద్యగ విరమణ సమావేశంలో మాట్లాడారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

బేతంచెర్ల,న్యూస్‌టుడే: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఐటీఐ ప్రిన్సిపల్ రాజశేఖర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఐటీఐ సూపరింటెండెంట్ ఎన్.శిరీష ఆధ్వర్యంలో విద్యార్థులతో స్వచ్ఛతా హీ సేవా ర్యాలీని శేషారెడ్డి ఉన్నత పాఠశాల నుంచి పాతబస్టాండు వరకు నిర్వహించారు. ఐటీఐ సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

పొలానికి కొలతలు వేయరూ!

ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే: హరివరంలో రైతు కొప్పెర ఓబులేసు పొలాన్ని కొలతలు వేయాలని మాలమహానాడు రాయలసీమ అధ్యక్షుడు కోకిల ప్రసాదు రైతుతో కలిసి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ శ్రీనివాసులను అభ్యర్థించారు. 13 రోజులు దాటినా ఎలాంటి సమాచారం ఇవ్వలేదని ప్రసాదు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. త్వరలో కొలతలు వేయిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలి

డోన్, న్యూస్‌టుడే: హిందూ సంప్రదాయాలను, సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలని వేద గాయత్రి బ్రాహ్మణ సంఘం గౌరవాధ్యక్షుడు శతావధాని గండ్లూరిదత్తాత్రేయస్వామి అన్నారు. సోమవారం హిందూధర్మపరిరక్షణకు స్థానిక వివేకానందవిగ్రహం వద్ద నుంచి నిరసన ర్యాలీ చేపట్టారు. కళ్లెశేషావలిశర్మ, గాయత్రి బ్రాహ్మణ సంఘం నాయకులు, వివేకానందసేవాసమితి సభ్యులు జగన్‌మోహన్, జొన్నలగడ్డ శ్రీనివాసులు పాల్గొన్నారు.

సేవా భావాలు అలవాటు చేసుకోవాలి

ప్యాపిలి, న్యూస్‌టుడే: విద్యార్థులు విద్యార్థి దశ నుంచే సేవా భావాలను అలవాటు చేసుకోవాలని ప్రియదర్శిని పాఠశాల హెచ్‌ఎం పార్థసారథి సూచించారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం పాఠశాల విద్యార్థులు సేకరించిన రూ.30 వేలను యూపీఎస్‌ఎఫ్ (అన్ ఎయిడెడ్ ప్రైవేటు స్కూల్ ఫెడరేషన్) రాష్ట్ర డైరెక్టర్ చంద్రశేఖర్‌కు సోమవారం అందజేశారు. డోన్ వైస్ ప్రెసిడెంట్ అక్బర్, ట్రెజరర్ పురుషోత్తం, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పన్ను చెల్లించకుండా వాహనాలు నడిపితే చర్యలు

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: రహదారి పన్ను చెల్లించకుండా వాహనాలు రోడ్లపై అక్రమంగా నడిపితే చర్యలు తీసుకుంటామని ఎంవీఐ టి.క్రాంతికుమార్ హెచ్చరించారు. సోమవారం అమకతాడు టోల్‌ప్లాజా సమీపంలో ఆయన తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు పాటించకుండా వరంగల్‌కు చెందిన ట్రావెల్ బస్సు బెంగళూరు నుంచి వరంగల్‌కు వెళ్తుండగా అమకుతాడు టోల్‌ప్లాజా వద్ద తనిఖీ చేశారు. రూ.1,03,600 జరిమానా విధించారు. ట్రావెల్ బస్సును సీజ్ చేసి డోన్ ఆర్టీసీ డిపోకు తరలించినట్లు ఎంవీఐ పేర్కొన్నారు.



పత్రాలను పరిశీలిస్తున్న ఎంవీఐ క్రాంతికుమార్

జరిమానా విధింపు

డోన్, న్యూస్‌టుడే: డోన్ పట్టణంలోని కోట్లవారిపల్లె వద్ద ఉన్న గనులశాఖ తనిఖీకేంద్రం నుంచి ఓ లారీ బిల్లులులేకుండా వెళ్తూ తప్పించుకునేందుకు యత్నించగా అధికారులు పట్టుకున్నారు. నాపరాళ్ల లోడుతో వెళ్తూ ఎలాంటి రాయల్టీ బిల్లులు చూపకపోవటంతో సీజ్‌చేసి డోన్ గ్రామీణ పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు ఆర్‌ఐ నవీన్ తెలిపారు. యజమానికి రూ.25,190 జరిమానా విధించామన్నారు.

కబ్జాదారుల నుంచి కాపాడాలి

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: డోన్‌లో ప్రభుత్వ భూములు కబ్జాలకు గురవుతున్నాయని, అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు తెలుగు విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ భూములను కబ్జాదారుల నుంచి కాపాడాలని డిమాండు చేస్తూ నంద్యాలలో కలెక్టరేట్ ఎదుట ఎన్‌ఎస్‌యూఐ నాయకులు సోమవారం ఆందోళన చేపట్టారు.

రక్షణచట్టం అమలు చేసేలా చూడాలి

డోన్, న్యూస్‌టుడే: ఏపీలో న్యాయవాదుల రక్షణచట్టం అమలు చేసేలా చూడాలని న్యాయవాదులు పులిదామోదర్, రాజేష్ తదితరులు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్‌గౌడ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. కర్నూలు లోని బార్ అసోసియేషన్ సభ్యులకు వినతిపత్రం అందజేశారు. న్యాయవాదులు పాల్గొన్నారు.



వేణుగోపాల్‌గౌడ్‌కు వినతిపత్రం ఇస్తున్న న్యాయవాదులు

చికిత్స పొందుతూ మృతి

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రమాదంలో గాయపడిన వెంకటయ్య (43) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్సై నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. బీరువోలుకు చెందిన వెంకటయ్య, సునీల్‌బాబు గతనెల 23న ద్విచక్ర వాహనంపై బేతంచెర్లకు వెళ్తుండగా వెనుక నుంచి కారు ఢీకొంది. కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వెంకటయ్య మృతి చెందినట్లు ఎస్సై వెల్లడించారు.

సుబ్బారెడ్డికి సముచిత స్థానం

బనగానపల్లి, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెదేపా నేత ధర్మవరం సుబ్బారెడ్డికి సముచిత స్థానం ఇచ్చారని తెదేపా వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు టంగుటూరి శీనయ్య పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవిని సుబ్బారెడ్డికి ఇవ్వడంతో పలువురు నాయకులు ఆయన్ని కలసి అభినందించారు. సోమవారం బనగానపల్లి నుంచి వెళ్లిన తెదేపా నాయకులు ధర్మవరం సుబ్బారెడ్డిని సన్మానించి మాట్లాడారు. అనంతరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసినందుకు తగిన ప్రతిఫలం దక్కిందని అన్నారు. మల్లారెడ్డి, నాగ్రేందరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.




దర్మవరం సుబ్బారెడ్డిని సన్మానిస్తున్న శీనయ్య

దోమల బెడద.. తీరని వ్యథ

బేతంచెర్ల, న్యూస్‌టుడే: బేతంచెర్ల పట్టణం 2021లో మేజర్ పంచాయతీ నుంచి నగర పంచాయతీ హోదాగా మారినా అపరిశుభ్ర సమస్యలు తాండవిస్తునే ఉన్నాయి. వివిధ కాలనీల్లో దోమల బెడద ఎక్కువవ్వడంతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. దోమల నివారణకు ద్రావణాల పిచికారీ సక్రమంగా చేయకపోవడంతో డెంగీ, మలేరియా, టైఫాయిడ్, విష జ్వరాలతో నివాసితులు బాధపడుతున్నారు.

పలు కాలనీలల్లో...

బేతంచెర్ల పట్టణంలో కోటపేట, సంజీవనగర్, హనుమాన్‌నగర్, కందకం, గౌరిపేట, తహసీల్దార్ కార్యాలయం వీధి, వడ్డేపేట, బేగర్‌పేట తదితర కాలనీల్లో మురుగు కాలువల పక్కన గృహ సముదాయాలు ఉన్నాయి. కాలువల పరిసరాల్లో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. వీధుల్లో కూడా చెత్తపోగులు ఎక్కడికక్కడ దర్శనమిస్తున్నాయి.



నీటిపై వాలిన దోమల దండు

ఏటా ప్రచార ఆర్భాటమే

గతంలో దోమలపై యుద్ధం పేరిట పలు కార్యక్రమాలు వివిధ శాఖల సమన్వయంతో నెలరోజుల పాటు నిర్వహించేవారు. కాలనీలల్లో సమస్యలు గుర్తించి నివారణ చర్యలు తీసుకునేవారు. సిబ్బంది కూడా ప్రత్యేకంగా వార్డుల్లో పర్యటించి ప్రజలకు సూచనలు చేసేవారు. ప్రస్తుతం అలాంటివేవీ కనిపించడం లేదు. దోమలు వృద్ధి చెంది ప్రజలపై దాడి చేస్తున్నప్పుడే వాటిని నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వాస్తవానికి అవి పుట్టకుండానే నిర్మూలించాలి. లార్వా దశలోనే నిర్మూలించాలి. కాలువల్లో గంబూషియా చేప పిల్లలు వదలాలి. ఆయిల్‌బాల్స్ వేయాలి. తద్వారా మురుగు కాలువల్లో దోమల ఉత్పత్తిని తగ్గించవచ్చు. మురుగు ఉన్నచోట స్ప్రేయింగ్ చేయాలి. దోమల ఉద్ధృతి ఎక్కువగానే ఉంది.

బేతంచెర్ల వార్డులు: 20
జనాభా: 42,250, గృహాలు: 11,572
పారిశుద్ధ్య కార్మికులు: ఇద్దరు
పారిశుద్ధ్య కార్మికులు: 48, రెగ్యులర్ లేరు.

దోమల బెడద ఎక్కువగా ఉంది
–రాజేశ్వరి, బేతంచెర్ల

బేతంచెర్లలోని పలు కాలనీల్లో దోమల బెడద ఎక్కువగా ఉంది. కోటకిందిపేట, కందకం లైను, పెద్ద కమేలా, బేగర్‌పేట తదితర వాసులు ఇబ్బందులుపడుతున్నారు. రాత్రివేళ దోమల బెడద ఎక్కువైంది. ఆయా కాలనీవాసులు విషజ్వరాలతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. నగర పంచాయతీ అధికారులు 15 రోజులకోసారి ఫాగింగ్ చేయాలి. అధికారులు ఆదిశగా చర్యలు చేపట్టడం లేదు.

ఫాగింగ్ నిర్వహణకు చర్యలు.
–సుజాత, శానిటర్ ఇన్‌స్పెక్టర్, బేతంచెర్ల

పట్టణంలో దోమలబెడద నివారణకు చర్యలు తీసుకుంటాం. సిబ్బందితో కాలువల్లో ద్రావణాలు పిచికారీ చేసేందుకు కృషి చేస్తాం. తరచూ పూడిక తీయిస్తున్నాం. దోమల నివారణకు పూర్తిస్థాయిలో చర్యలు చేపడతాం.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: కోవెలకుంట్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు రాజయ్య సోమవారం తెలిపారు. బనగానపల్లిలో స్కూల్ గేమ్స్ పోటీల్లో కబడ్డీ, యోగా, బ్యాడ్మింటన్, వాలీబాల్‌లో మహేష్, జీవన్‌కుమార్, నరేష్, సుంకిరెడ్డి, విశాల్, హుస్సేన్‌వలి, అబ్దుల్ ప్రతిభ చూపారని ఉపాధ్యాయులు వెంకటేశ్వరరెడ్డి, నాగేశుడు, మల్లికార్జున, సుగుణ, జరాబి అభినందించారు.

సంజామల, న్యూస్‌టుడే: పేరుసోముల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని సీతారావమ్మ చెప్పారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సమావేశంలో ఆమె మాట్లాడారు. అండర్ 14, 17 విభాగాల్లో ఖోఖో, వాలీబాల్‌లో ప్రతిభ కనబరచి జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికయ్యారన్నారు.

సంజామల, న్యూస్‌టుడే: సంజామల ప్రభుత్వ ఉన్నత పాఠశాల పీడీ బాషా ఇటీవల జరిగిన జిల్లా స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ 40ప్లస్ పురుషుల విభాగం పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు శ్రీనివాసులు చెప్పారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏపీఎం, సీసీలకు సన్మానం

రుద్రవరం, న్యూస్‌టుడే: స్థానిక వెలుగు కార్యాలయంలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన ఏపీఎం కల్పలతాదేవి, సీసీ దేవానంద్‌లను సిబ్బంది ఘనంగా సన్మానించారు. వీవోఏల జిల్లా అధ్యక్షుడు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

గోమాతను రక్షించిన అగ్నిమాపక అధికారులు

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: డోన్ పట్టణంలో కాలువలో ఇరుక్కుపోయిన గోమాతను అగ్నిమాపక అధికారులు సురక్షితంగా బయటకు తీశారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా ఉన్న కాలువలో ఆవు పడిపోవడంతో తాళ్లను కట్టి బయటకు అగ్నిమాపక అధికారి రంగస్వామిగౌడ్, లీడింగ్ ఫైర్‌మెన్ ప్రభాకర్, రంగస్వామి, నాగేంద్రబాబు, రాజశేఖర్, గౌరీశంకర్ తదితరులు బయటకు తీశారు..